నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 31-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 70 పేజీలు:4 వెల: రూ.1/-

పునీత్ అంత్యక్రియలు ఆదివారమే.. వెల్లడించిన సీఎం బొమ్మై

బెంగళూరు, అక్టోబర్ 30:: సినీ ప్రపంచాన్ని విషాదంలో ముంచుతూ హఠాన్మరణం పాలైన కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై వెల్లడించారు. అమెరికాలో ఉన్న పునీత్ కుమార్తె వందిత తండ్రి చివరి చూపు కోసం వస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇప్పటికే ఆమె ఢిల్లీకి చేరుకుందని, బెంగళూరు వచ్చే సరికి సాయంత్రం 7 గంటలు అవుతుందని చెప్పారు. సంప్రదాయం ప్రకారం రాత్రి సమయంలో అంత్యక్రియలు జరపరని, అందువల్ల ఆదివారం నాడు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఆదివారం నాడు కంఠీరవ మైదానంలో పునీత్ రాజ్‌కుమార్ అంత్యక్రియలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

సమ్మక్క-సారలమ్మ మహాజాతరను ఘనంగా నిర్వహిద్దాం : మంత్రి సత్యవతి

హైదరాబాద్ , అక్టోబర్ 30:ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క ? సారలమ్మ మహాజాతరను ఘనంగా నిర్వహిద్దామని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వచ్చే ఏడాది జాతర జరుగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించి అమ్మవారి ఆశీయస్సులు పొందేవిధంగా సమష్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.

గతంలో జాతర నిర్వహించిన సమయంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని.. ఈ సారి మరింత మెరుగ్గా పని చేయాలని ఆదేశించారు. గత జాతర పూర్తయ్యాక కరోనా లాక్‌డౌన్ పెట్టుకున్నామని, ఈ సారి జాతరకు ముందు సంపూర్ణంగా కరోనా మహమ్మారి నశించాలని అమ్మవార్లను కోరుకున్నానన్నారు. జాతరకు వంద రోజుల సమయం మాత్రమే ఉందని, సీఎం కేసీఆర్ జాతరకు భారీగా నిధులు మంజూరు చేసి ఘనంగా జరుపుతున్నారన్నారు.

జాతరకు సంబంధించి ఏఏ ఇబ్బందులున్నాయని ఇప్పటికే గుర్తించారని, చుట్టుపక్కల జరిగే చిన్న జాతరలకు కూడా నిధులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో రూ. 75కోట్లతో శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సారి అధికారులంతా కలిసికట్టుగా పని చేసి, జాతరకు వచ్చే భక్తులకు అన్నివసతులు కల్పించాలన్నారు.

ఇప్పటికే రూ.120కోట్ల ప్రతిపాదనలు కలెక్టర్ ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. మూడు చెక్‌డ్యామ్‌లు తొలగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అదనపు ఓహెచ్ ఆర్ నీలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అదనపు బ్లాక్స్, నూతన డైనింగ్ హాల్స్ కట్టనున్నట్లు చెప్పారు. స్థానికంగా నేల స్వభావంతో రోడ్లు కొంగుతున్నాయని, వీటికి మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

జంపన్న వాగు వద్ద రెండు దుస్తులు మార్పిడి చేసుకునేందుకు గదులతో పాటు పోలీసులకు శాశ్వతంగా వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గుంజేడు ముసలమ్మ జాతరకు వసతులు కల్పించాలని విజ్ఞప్తులు వచ్చాయని, ఈ మేరకు వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పగిడిద్ద రాజు దగ్గరా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జాతర విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో గిరిజన వర్సిటీ సమస్యకు పరిష్కారం

గిరిజన విశ్వ విద్యాలయం సమస్య త్వరలోనే పరిష్కారం కానుందని మంత్రి సత్యవతి తెలిపారు. గట్టమ్మ దగ్గర డిగ్రీ కాలేజీకి రూ.55కోట్ల కేటాయించినట్లు చెప్పారు. త్వరలోనే టెండర్ పనులు మొదలవుతాయని, మనగపేట దగ్గర ఫుడ్ బ్యాంక్ పనులు నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే పనులు మొదలవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ గత జాతరలో వచ్చిన సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రహదారులు బాగుంటే ట్రాఫిక్ సమస్య తీరుతుందని, తిరుగు జాతర ఏర్పాట్లపై కూడా దృష్టి పెట్టి వసతులు కల్పించాలన్నారు. సమీక్షా సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ నాగజ్యోతి, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ సంగ్రామ్ సింగ్, ఆర్డీఓ రమాదేవి, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ శంకర్, ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ హేమలత, డీటీడీవో ఎర్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, ఐటీడీఏ ఏపీవో వసంత్ కుమార్, జడ్పీటీసీలు ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఈవో రాజేందర్, ప్రధాన పూజారి జగ్గారావు, పూజారులు, నేతలు పాల్గొన్నారు.

కేదార్‌నాథ్‌లో ఆదిశంకరాచార్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్న మోదీ: అమిత్ షా

డెహ్రాడూన్, అక్టోబర్ 30:: ప్రధాని నరేంద్ర మోదీ నవంబర్ 5వ తేదీన కేదార్‌నాథ్ వెళ్లనున్నారు. అక్కడ ఆయన ఆది శంకరాచార్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. డెహ్రాడూన్‌లో జరిగిన ఎన్నికల సభలో పాల్గొన్న అమిత్ షా మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో ఉత్తరాఖండ్‌లో అన్ని రంగాల్లో అభివృద్ధి చోటుచేసుకున్నట్లు చెప్పారు. సీఎం పుష్కర్ సింగ్ ధామీ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేపట్టేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కోవిడ్19, వరదల సమయంలో కాంగ్రెస్ నేతలు కనిపించలేదని, కానీ ఎన్నికల వేళ మీడియా సమావేశాలకు ఆ నేతలు వస్తున్నట్లు షా ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీల గురించి చర్చించేందుకు ముందుకు రావాలని మాజీ సీఎం హరీశ్ రావత్‌కు సవాల్ విసిరారు. మేనిఫెస్టోలో 85 శాతం హామీలను నిజం చేశావన్నారు. ప్రకృతి విపత్తు సంభవిస్తుందని తెలియగానే, చార్ ధామ్ యాత్రను నిలిపేశామని సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ముందు జాగ్రత్తగా ఆదేశాలు ఇవ్వడం వల్ల, యాత్రికుల ప్రాణాలను కాపాడినట్లు ఆయన చెప్పారు.

పోప్ ఫ్రాన్సిస్‌ను భారత్‌కు ఆహ్వానించిన ప్రధాని మోదీ

వాటికన్, అక్టోబర్ 30: పోప్ ఫ్రాన్సిస్‌ను ప్రధాని నరేంద్రమోదీ భారత్‌కు ఆహ్వానించారు. జీ-20 సదస్సులో పాల్గొనేందుకు ఇటలీకి వెళ్లిన ప్రధాని మోదీ.. ఇవాళ వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌తో భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాలపాటు పోప్ ఫ్రాన్సిస్, ప్రధాని మోదీ వివిధ విషయాలపై మాట్లాడుకున్నారు.

అనంతరం భారత్‌కు రావాల్సిందిగా పోప్‌కు ప్రధాని ఆహ్వానం తెలిపారు. తనకు పోప్ ఫ్రాన్సిస్‌తో పలు అంశాలపై మాట్లాడే అవకాశం దక్కిందని, ఆయనను తాను భారత్‌కు ఆహ్వానించానని భేటీ ముగిసిన అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

కాగా, పోప్ ఫ్రాన్సిస్‌కు భారత్‌లోని క్రైస్తవ సంఘాల నుంచి చాలా రోజులుగా ఆహ్వానం ఉన్నది. దాంతో ఆయన కూడా భారత్‌కు వెళ్లాలనుకుంటున్నట్లు సమాచారం. అయితే భారత్‌లోని క్రైస్తవ సంఘాల నుంచి ఆహ్వానం ఉన్నా.. ప్రభుత్వం నుంచి ఆహ్వానం లేదు. దాంతో ఆయన భారత్‌లో పర్యటించలేకపోయారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి కూడా ఆహ్వానం అందడంతో త్వరలోనే పోప్ ఫ్రాన్సిస్ భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నది. కాగా, 1999లో చివరిసారి పోప్ జాన్ పాల్ భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత ఇప్పుడు పోప్ ఫ్రాన్సిస్‌కు భారత్‌కు వచ్చే అవకాశం ఉంది.

అమెరికా అధ్యక్షుడిని కలిసిన పోప్ ఫ్రాన్సిస్

వాటికన్, అక్టోబర్ 30:: క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్‌ను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కలిశారు. వాటికన్ నగరంలోని అపోస్టోలిక్ ప్యాలెస్‌లో పోప్ ఫ్రాన్సిస్‌తో బైడెన్ భేటీ అయ్యారు. ఆ ఇద్దరూ పలు అంశాలపై చర్చించుకున్నారు. పలసలు, మానవ హక్కులు, కోవిడ్ మహమ్మారి లాంటి అంశాలపై ఆ ఇద్దరూ ముచ్చటించినట్లు తెలుస్తోంది. దీనిపై వాటికన్ ఓ ప్రకటన రిలీజ్ చేసింది. రోమ్‌లో జరిగే జీ20 సమావేశాల్లో తీసుకోబోయే నిర్ణయాల గురించి కూడా చర్చించుకున్నారు. భూగోళ సంరక్షణ కోసం తీసుకోవాల్సిన అంశాలపైన కూడా ఇద్దరు మాట్లాడుకున్నారు. శరణార్థులకు ఎటువంటి సహాయం అందించాల్సిన అంశాలను చర్చించారు.

పునీత్ పార్థివదేహానికి కర్నాటక గవర్నర్, సీఎం నివాళి

బెంగళూరు. అక్టోబర్ 30: కన్నడ నటుడు పునీత్ రాజ్‌కుమార్ గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆయన పార్థివదేహానికి ఇవాళ కర్నాటక రాష్ట్ర గవర్నర్ థావర్‌చండ్ గెహ్లోట్, సీఎం బసవరాజ్ బొమ్మైలు పుష్పనివాళి అర్పించారు. 46 ఏళ్ల పునీత్ రాజ్‌కుమార్ శుక్రవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ప్రస్తుతం కంఠీరవ స్టేడియంలో అభిమానుల సందర్శన కోసం రాజ్‌కుమార్ మృతదేహాన్ని అక్కడ ఉంచారు. కడసారి చూపు కోసం కంఠీరవ స్టేడియానికి రాజ్‌కుమార్ ఫ్యాన్స్ పోటెత్తారు. ఇవాళ సాయంత్రం 6.30 నిమిషాలకు రాజ్‌కుమార్ పార్థివదేహానికి అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు రాజ్‌కుమార్ కూతురు అమెరికా నుంచి వస్తోంది. ఆమె ఇవాళ మధ్యాహ్నం 1.30 నిమిషాలకు ఢిల్లీ చేరుకుంటుంది. ఆ తర్వాత సాయంత్రం బెంగుళూరుకు రానున్నది. నటుడు రాజ్‌కుమార్ మృతి పట్ల ప్రధాని మోదీతో పాటు పలువురు సినీ ప్రముఖులు, క్రీడాకారులు, రాజకీయవేత్తలు షాక్ వ్యక్తం చేశారు.

పునీత్ భౌతిక కాయానికి ఎన్టీఆర్ నివాళులు..!

బెంగళూరు. అక్టోబర్ 30:కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ శుక్రవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఉదయం జిమ్ చేస్తుండగా ఒక్కసారిగా ఆయనకు ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలించారు.

అప్పటికే ఆయన పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. మరి కొద్ది నిమిషాలలోనే ఆయన మరణించినట్టు స్పష్టం చేశారు. పునీత్ మృతి కన్నడిగులకు తీరని శోకాన్ని మిగిల్చింది.

పునీత్ పార్థివ దేహాన్ని అభిమానుల సందర్శనార్థం బెంగళూరు కంఠీరవ స్టేడయంలో ఉంచగా, ఆయనను చివరి చూపు చూసేందుకు టాలీవుడ్ ప్రముఖులు కూడా వస్తున్నారు.

ఇప్పటికే శనివారం ఉదయం కంఠీరవ స్టేడియానికి వెళ్లి పునీత్‌కు నివాళులర్పించారు బాలయ్య . పునీత్ పార్థివదేహాన్ని చూసి భావోద్వేగానికి గురైన ఆయన కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం పునీత్ సోదరుడు శివరాజ్‌కుమార్‌ని పరామర్శించారు.

బాలకృష్ణతోపాటు నరేశ్, శివబాలాజీ, ప్రభుదేవా సైతం నివాళులర్పించారు. ఇక తాజాగా జూనియర్ ఎన్టీఆర్ కూడా కంఠీరవ స్టేడియానికి వెళ్లి తన స్నేహితుడికి నివాళులు అర్పించారు. స్నేహితుడిని అలా చూసి కన్నీరు కూడా పెట్టుకున్నారు ఎన్టీఆర్. కాగా, రాజ్ కుమార్ టైం నుండి ఆ కుటుంబంతో నందమూరి ఫ్యామిలీకి ఎంతో అనుబంధం ఉంది.

తాండూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి బాటలు..

తాండూరు, అక్టోబర్ 30: తాండూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తూ 26కోట్ల, 50 లక్షల రూపాయల నిధులతో పలు సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి , స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి , చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య , కలెక్టర్ నిఖిల చేపట్టారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల లో 50 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించనున్న ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. తాండూరు నియోజకవర్గం యాలాల్ మండలం కొకట్ గ్రామ పరిధిలో రెండు కోట్ల, 25 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని,20 కోట్ల రూపాయల నిధుల తో నిర్మించిన మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. సాయిపూర్ లో 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన అంగన్ వాడి భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసారు. పట్టణంలో 3 కోట్ల, 47 లక్షలతో నిర్మించిన నూతన మున్సిపల్ భవనాన్ని ప్రారంభించారు. చెత్త ఆటోలను ప్రారంభించారు.అంతకుముందు హనుమాన్ ఫంక్షన్ హాల్ లో 165 మంది లబ్ధిదారుల కు,1 కోటి 65 లక్షల 19 వేల రూపాయల కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాండూరు అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నారన్నారు. 100 పడకల ఆస్పత్రి ని చూస్తే స్వర్గీయ ఇంద్రారెడ్డి గుర్తుకు వచ్చారని తెలిపారు. నాడు మహేందర్ రెడ్డిని ఎమ్మెల్యే గా గెలిపిస్తే తాండూరుకు 100 పడకల ఆస్పత్రి తెస్తా అని చేసిన వాగ్దానం సాకారం కావటం ఆనందంగా ఉందన్నారు. రెండవ దశలో వికారాబాద్ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ ఆదేశం తో ఆస్పత్రికి రోగుల వెంట వచ్చే వారి కోసం వెయిటింగ్ హాల్ లు నిర్మిస్తామని చెప్పారు. 100 పడకల ఆస్పత్రితో పాటు,మాత శిశు సంరక్షణ కేంద్రాల్లో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. నాడు రంగారెడ్డి జిల్లాలో ఒక కళాశాల కూడా లేనప్పుడు చొరవ తీసుకొని,చేవెళ్ల తో పాటు 5 కళాశాలలు మంజూరు కావ డం విశేషమని చెప్పారు.నేడు అవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చి విద్యార్థులతో కళకళ లాడటం హర్షదాయకమన్నారు. ప్రజలకు ఉపయోగ పడే కార్యక్రమాలు చేపడుతూ తెలంగాణా ప్రభుత్వం ముందుకి వెళ్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో అమలు అవుతున్నాయి. ఆడ పిల్ల పుడితే గతంలో బాధ పడే వారు?నేడు కేసీఆర్ మేనమామ లాగా కళ్యాణలక్ష్మి,షాది ముబారక్ లతో పేదింటి ఆడ పిల్లల పెళ్ళిళ్ళ కు అండగా ఉన్నారు.నేడు లక్ష్మి పుట్టిందని ఆనందపడుతున్నారు. రైతు బంధు,రైతు భీమాతో రైతన్నకు అండగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఒంటరి మహిళలకు పెన్షన్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం టిఆర్ ఎస్ అని చెప్పారు.

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల్లపుడే రాజకీయాలు.. తర్వాత అందరూ అభివృద్ధిలో కలిసి రావాలన్నారు. తెలంగాణలో ప్రజలకు ఉపయోగపడేలా,అన్ని కార్యాలయాలు ఒకే దగ్గర ఉండేలా సమీకృత కలెక్టర్ భవ నాలు నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు క్యాంప్ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టామన్నారు.. కాలుష్యం తగ్గించటానికి అందరూ తమ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటి తాండూరులో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. గ్రీన్ బడ్జెట్ వినియోగించి,ప్రభుత్వ లక్ష్యం మేరకు కౌన్సిలర్లు,వైస్ ఛైర్మన్, చైర్మన్ ,కమిషనర్ లు చొరవ చూపాలని తెలిపారు. నిధుల కోసం కృషి చేద్దామని చెప్పారు. వర్షాలు పడినప్పుడు పాడైన రోడ్ల బాగు కోసం కృషి చేస్తాం. మంత్రి కే టి ఆర్ చొరవతో అనేక పనులు మంజూరు చేయించాను.. కౌన్సిలర్లు అందరూ ఏకతాటిగా ఉండి,అభివృద్ధి కి పాటుపడాలన్నారు .

అవినీతి, కుంభకోణానికి పర్యాయపదం కాంగ్రెస్ : అమిత్‌షా

డెహ్రాడూన్, అక్టోబర్ 30:: కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఈ పార్టీ అవినీతి, కుంభకోణాలకు పర్యాయపదమని, ఈ పార్టీ నాయకులు తామిచ్చిన వాగ్దానాలను ఏనాడూ పూర్తిచేయరని ఎద్దేవా చేశారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో 'ఘసియారి కళ్యాణ్ యోజన' ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో షా మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు చేసిన, నెరవేర్చిన హామీలపై బహిరంగ చర్చకు ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్ సిద్ధమా అని అమిత్ షా సవాల్ విసిరారు. మ్యానిఫెస్టోలో పెట్టిన దాదాపు 85 శాతం వాగ్దానాలు పూర్తిచేసినట్లు తెలిపారు.

'అవినీతి, కుంభకోణాలకు కాంగ్రెస్ పర్యాయపదంగా మారింది. ఏ రాష్ట్ర అభివృద్ధి గురించి కూడా ఆ పార్టీ నేతలు పట్టించుకోరు. కాంగ్రెస్ ఎప్పుడూ తన వాగ్దానాలను తుంగలో తొక్కుతుంది. కాంగ్రెస్ బుజ్జగింపులు మాత్రమే చేస్తుంది. ఉత్తరాఖండ్‌కు ఎలాంటి సంక్షేమ పనులు చేపట్టలేదు' అని అమిత్ షా అన్నారు. కొవిడ్-19, రాష్ట్రంలో వరదలు వచ్చిన సమయంలో కాంగ్రెస్ నేతలు కనిపించకుండాపోయారని, అదే, ఎన్నికలు దగ్గర పడగానే బయటకు వచ్చి మీడియా సమావేశాలు ప్రారంభిస్తున్నరని ఎద్దేవా చేశారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు గిఫ్ట్ ఇచ్చిన ప్రధాని మోదీ

వాటికన్, అక్టోబర్ 30:: క్యాథలిక్ క్రైస్తవ మతగురువు పోప్ ఫ్రాన్సిస్‌ను ఇవాళ ప్రధాని మోదీ కలిశారు. ఈ నేపథ్యంలో పూర్తిగా సిల్వర్‌తో తయారు చేసిన క్యాండిల్ స్టాండ్‌ను పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రధాని మోదీ బహూకరించారు. క్యాండిల్ స్టాండ్‌తో పాటు ఓ పుస్తకాన్ని కూడా ఫ్రాన్సిస్‌కు అందజేశారు. వాతావరణ నియంత్రణకు ఇండియా కట్టుబడి ఉన్న అంశాలతో కూడిన పుస్తకాన్ని పోప్‌కు మోదీ అందించారు. ఇక ఫ్రాన్సిస్ కూడా మోదీకి ఓ గిఫ్ట్ ఇచ్చారు. బ్రాంజ్‌తో తయారు చేసిన ఓ సర్క్యులర్ మెమోంటోను అందజేశారు. బైబిల్ సూక్తులతో ఉన్న ఆ గిఫ్ట్‌ను మోదీ అందుకున్నారు. రోమ్‌లో జరుగుతున్న జీ20 సదస్సుకు వెళ్లిన మోదీ అక్కడ ఫ్రాన్సిస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇండియాకు రావాలంటూ ఫ్రాన్సిస్‌కు మోదీ ఆహ్వానం పలికారు. ఇద్దరి మధ్య 55 నిమిషాల పాటు భేటీ జరిగింది. 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి వాటికన్‌ను విజిట్ చేశారు. రెండవ జాన్ పౌల్‌ను ఆయన కలివారు. ఆ తర్వాత ప్రధాని మోదీ అక్కడకు వెళ్లారు.

చరిత్రలో నేటినిజం

తే॥ జీవితమను పగడమొప్పుచు
నీవిశ్వపు నెల్ల జూడ నిప్పిడు దురుచున్
సూటి కుడైన తొలంబును
పావన మానసు డనుచును బ్రస్సుతులు గనెన్!

(అక్టోబర్ 31 నావికుడు కొలంబస్ జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210

హుజూరాబాద్‌లో భారీగా పోలింగ్..

హుజురాబాద్, అక్టోబర్ 30:హుజూరాబాద్ ఉప ఎన్నికలో పోలింగ్ శాతం ఎక్కువవుతోంది. ప్రజలు కూడా ఓటు వేసేందుకు క్యూ కడుతున్నారు.

ఈ పోలింగ్ మరో రెండుగంటల్లో ముగియనుంది. కాగా సాయంత్రం 5 గంటలకు పోలింగ్ 76.26 శాతానికి చేరింది. కాగా పోలింగ్ శాతం కూడా పెరిగే అవకాశం ఉంది. గంట గంటకు పది శాతం పోలింగ్ పెరుగుతుందంటం విశేషం. దీంతో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదయ్యే అవకాశం ఉంది. 2018 ముందస్తు ఎలక్షన్ సమయంలో 84.5 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం దీన్ని అధిగమించే అవకాశం కనిపిస్తోంది.హుజూరాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వస్తున్నారు. మధ్యాహ్నం నుంచి యువత పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కువగా కనిపిస్తున్నారు. హుజూరాబాద్‌లో మొత్తం 2,36,283 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 1,18,720 మంది పురుష ఓటర్లు, 1,17,563 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గతంలో ఉన్న ఓటర్ల కన్నా కొత్తగా 10 వేల వరకు కొత్త ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కడక్కడ చెదురు మదురు సంఘటనలు జరిగినా..సమయం దగ్గరపడే కొలద్ది పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది.

పట్టణాలకు వలసలతో గ్రామీణ భారతం వెలవెల..!

(31 అక్టోబర్ "ప్రపంచ నగరాల దినం" సందర్భంగా)

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 27 డిసెంబర్ 2013న తీసుకున్న 68/239 తీర్మానం ప్రకారం ప్రతియేటా 31 అక్టోబర్‌న 'ప్రపంచ నగరాల దినోత్సవం (వరల్డ్ సిటీస్ డే)' 2014 నుంచి పాటించడం జరుగుతున్నది. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలలోనే నివసించడం జరుగుతోంది. వరల్డ్ సిటీస్ డే-2021 నినాదంగా 'అడాప్టింగ్ సిటీస్ ఫర్ క్లైమెట్ రెసిలియన్స్' అనే అంశం తీసుకోబడింది. ప్రపంచ నగరాలు మరియు మహానగరాల స్వచ్ఛత, పట్టణీకరణ సమస్యలు, నగరీకరణ ఎదుర్కొంటున్న సవాళ్ళు, సుస్థిరాభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు, నగరాల మధ్య సమన్వయ సహకారాలు వంటి అంశాలను చర్చించే వేదికగా ప్రపంచ నగరాల దినం ఉపయోగపడుతోంది. కోవిడ్-19 విజృంభనతో నగరాలు ఖాళీ చేయబడి గ్రామీణ మరియు మండల కేంద్రాలు జన కళతో నిండాయి. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో నగరాల చుట్టు మురికివాడలు పుట్టుకురావడం, స్వచ్ఛత లోపించడం, పర్యావరణ సమస్యలు ఉత్పన్నం కావడం, ఆర్థిక సామాజిక సాంస్కృతిక మార్పులు చోటు చేసుకోవడం, ప్రకృతికి విరుద్ధంగా మానవ జీవనశైలి వేగంగా మారడం, రద్దీ పెరగడం, నీటి కొరత ఉత్పన్నం కావడం లాంటి సమస్యలు నగరాలను వెన్నాడుతున్నాయి. భారత ప్రభుత్వం దేశంలోని మహానగరాలు మరియు ముఖ్య పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి 'స్వచ్ఛ భారత్ మిషన్'లో భాగంగా 'స్మార్ట్ సిటీ' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్త నగరాల స్వచ్ఛ సర్వేక్షణ్-2020 సర్వేలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం క్లీన్ సిటీ, వాటర్ ప్లస్ సిటీగా వరుసగా 4వ సారి ప్రథమ స్థానంలో నిలిచి ఇతర నగరాలకు ఆదర్శంగా మారింది. 2021 క్లీన్ సిటీస్ వివరాలు ఇంకా ప్రకటించాల్సి ఉంది. స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహణకు 6000 పాయింట్లతో నగరపౌర సేవలు, పౌరుల అభిప్రాయాలు, ప్రత్యక్ష పరిశీలనలు మరియు టాయిలెట్ల అందుబాటు వంటి అంశాలతో క్లీన్ సిటీల జాతీయ జాబితాను తయారుచేస్తారు. ఒక మిలియన్‌కు పైగా జనాభాగల ఇండోర్ నగరం మె?దటి నుండి ప్రతి సంవత్సరం క్లీన్ సిటీగా ఎంపిక కావడంతో ఈ నగరానికి గుర్తింపు మరియు కీర్తి పెరిగి, విమర్శకులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. గతంలో అన్ని నగరాల వలె దుమ్ము, ధూళి, చెత్త చెదారం, మురుగు నీరు, వీధుల్లో జంతువుల స్వైరవిహారలతో సహజీవనం చేసిన ఇండోర్ నగరవాసులు ఇప్పుడు తమ సిటీని చూసి గర్వపడుతున్నారు. 2016లో మె?దటిసారి నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్ ప్రకారం 25వ స్థానాన్ని కైవసం చేసుకోగా మైసూర్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం బహిరంగ మల విసర్జన రహిత (ఓపెన్ డిఫొకేషన్ ఫ్రీ, ఓడియఫ్) రెండవ నగరంగా ప్రకటన చేసింది. దీనితో స్ఫూర్త పొందిన ఇండోర్ నగర పాలక సంస్థ (ఐయంసి) పారిశుధ్య సిబ్బందిని అదనంగా 2000ని నియమించుకొని, మె?త్తం 3500 మంది పారిశుధ్య కార్మికులతో ఇంటింటా తడి పొడి చెత్తను 600 వాహనాలతో సేకరించడానికి రూ.180/- కోట్లు వెచ్చించడం, జరిగింది. ఐయంసి ప్రయత్నానికి ముగ్ధులైన నగర పౌరులు, స్వచ్ఛంధ సంస్థలు, బాధ్యతగల పౌర సమాజం కూడా తమ సహకారం అందించడం ప్రారంభమైంది. ఇంటింట సేకరించిన వ్యర్థాలను రెడ్యూస్, రీయూజ్ మరియు రీసైకిల్ పద్ధతిలో చెత్తను విభజించి ప్రాసెస్ చేయడంతో నగర సుందరీకరణకు శ్రీకారం చుట్టబడింది. నగరంలోని 85 డివిజన్ల నుండి 1,115 మిలియన్ టన్నుల చెత్తను సేకరించడం నిత్యకృత్యమైంది. 2017 మరియు 2018ల్లో అత్యంత స్వచ్ఛ (క్లీనెస్ట్) సిటీగా ప్రథమ స్థానంలో నిలవడంతో, తమ గుర్తింపును నిలుపుకునేందుకు 8000 మంది మునిసిపల్ సిబ్బందితో నిత్యం నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చారు. స్వచ్ఛ సిటీగా పేరొందిన ఇండోర్‌లో ప్రస్తుతం నగర పౌరులు గర్వంగా, క్రమశిక్షణగా సైనికుల్లా సుందరీకరణలో భాగస్వాములు కావడంతో ప్రభుత్వ ప్రయత్నాలు సులభమైనాయి.

2019లో తిరిగి ప్రథమ స్థానంలో నిలిచిన ఇండోర్ హాట్రిక్ విజయం సాధించింది. 2020లో అగ్రస్థానంలో నిలిచి నాలుగవసారి తన సత్తా చాటుకుంది. 2020 క్లీన్ సిటీల జాబితాలో ఇండోర్ తరువాత సూరత్, నవీ ముంబాయ్, విజయవాడ, అహమ్మదాబాద్, రాజ్‌కోట్, భోపాల్, ఛండీఘర్, విశాఖపట్టణం మరియు వడోదరలు మె?దటి పది స్థానాలలో నిలిచాయి. 2020లో ఉత్తమ గంగా తీర నగరంగా వారణాసి నిలిచింది. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 4,242 నగరాలు, 62 కంటోన్మెంటులు మరియు 92 గంగాతీర నగరాలలోని 1.9 కోట్ల పౌరుల నుండి అభిప్రాయాలు సేకరించడమే కాకుండా వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ, మురికి నీటి నిర్వహణ మరియు ట్రీట్‌మెంట్, ఘన కాలుష్య రహిత నగర ప్రయత్నాలు లాంటి అంశాలను పరిశీలించి క్లీన్ సిటీల జాబితాను తయారుచేసి వివిధ వర్గాలలో స్వచ్ఛ మహోత్సవ్-2020 పేరుతో 129 అవార్డులను ప్రకటించారు. ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ మరియు మహారాష్ట్రలు ఉత్తమ రాష్ట్రాలుగా స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంలో ముందున్నాయి. క్లీన్ సిటీల జాబితాలో బీహార్‌కు చెందిన పాట్నా, గయ, భాగల్‌పూర్, బ్యూక్సర్, పర్సాబజార్, బీహార్‌షరీఫ్ మరియు సహర్సా నగరాలు చివరలో (డర్టీ సిటీలుగా) ఉన్నాయి. 4,324 ఓడియఫ్ ప్రాంతాలుగా, 1,808 నగరాలు ఓడియఫ్‌లుగా నిలిచాయి. 2020లో 66 లక్షల గృహాలలో టాయిలెట్లు, 6 లక్షల పబ్లిక్ టాయిలెట్లు నిర్మించడమ జరిగింది. దేశంలో 6 నగరాలు 5-స్టార్, 86 నగరాలు 3-స్టార్ మరియు 64 సిటీలు 1-స్టార్ హోదాను పొందాయి. 2020లో తెలంగాణ రాష్ట్రంలో 23వ స్థానంలో హైదరాబాద్, 73వ స్థానంలో కరీంనగర్ మరియు వరంగల్ 144వ స్థానం పొందింది. ఏపిలో 6వ, 12వ మరియు 17వ స్థానాలలో వరుసగా విజయవాడ, తిరుపతి మరియు విశాఖలు నిలిచాయి.

2019లో ఇండోర్, అంబికాపూర్, మైసూర్, ఉజ్జయిని, న్యూఢిల్లీ, అహమ్మదాబాద్, నవీ ముంబాయ్, తిరుపతి, రాజ్‌కోట్ మరియు దేవాస్ నగరాలు క్లీన్ సిటీల జాబితాలో ముందున్నాయి. 2018లో ఇండోర్, భోపాల్, ఛండీగర్, న్యూఢిల్లీ, విజయవాడ, తిరుపతి, విశాఖపట్టణం, మైసూర్, నవీ ముంబాయ్ మరియు పూనెలు అగ్రస్థానంలో ఉన్నాయి. వరుసగా మూడు సంవత్సరాలు మె?దటి పది స్థానాలలో చోటు దక్కించుకున్న ఇండోర్ (మూడుసార్లు ప్రథమ స్థానం) మరియు నవీ ముంబాయ్ (3వ, 7వ, 9వ స్థానాలు)లు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ నగరాలైన విజయవాడ (4వ, 5వ), విశాఖపట్టణం (9వ, 7వ) మరియు తిరుపతి (8వ, 6వ)లు గత మూడు సంవత్సరాలలో రెండు సార్లు క్లీన్ సిటీల జాబితాల్లో పది స్థానాల లోపు నిలిచాయి. ఇండియాలోని 100 స్మార్ట్ సిటీల జాబితాలో ఏపి నుండి అమరావతి, విశాఖ, కాకినాడ మరియు తిరుపతి నగరాలు ఉన్నాయి. తెలంగాణలో స్మార్ట్ సిటీలుగా వరంగల్ మరియు కరీంనగర్‌లు ఎంపికైనాయని మనకు తెలుసు. తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖ మరియు తిరుపతి నగరాలు ఉత్తమ ర్యాంకుల్లో ఉండగా, తెలంగాణలో వరంగల్ మరియు కరీంనగర్‌లు కొంత వెనుకంజలో ఉండడం బాధను కలిగిస్తున్నది. మన రెండు తెలుగు రాష్ట్రాలు స్వచ్ఛ సర్వేక్షణ్ జబితాలో మె?దటి పదిలోపు ర్యాంకులను పొందాలని బాధ్యతగల తెలంగాణ పౌరులుగా కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సొంత వైద్యంతో అనర్థాలు.. కౌంటర్ మెడిసిన్ ఇంకా డేంజర్

హైదరాబాద్ , అక్టోబర్ 30:: జలుబు, దగ్గు, చిన్నపాటి జ్వరమే కదా.. మెడికల్ షాప్‌కు వెళ్లి ఓ ట్యాబ్‌లెట్ కొనుక్కుని వేసుకుంటే సరిపోద్ది.. లేదంటే ఓ సిరప్ కొనుక్కుని తాగితే తగ్గిపోతుందనుకోవడం అంత మంచిదికాదంటున్నారు డాక్టర్లు. అట్లా చేయడం కూడా మానుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలకు డాక్టర్‌ను సంప్రదించకుండానే నేరుగా మెడికల్ షాప్‌కు వెళ్లి కౌంటర్ ఆర్డర్‌తో మందులు కొని వేసుకోవడం ఇటీవలి కాలంలో పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఓ వైపు కరోనా ? మరోవైపు వర్షాకాలంలో విజృంభిస్తున్న డెంగీ, మలేరియా తదితర సీజనల్ జ్వరాలు.

ఈ పరిస్థితుల్లో చిన్నారులు మొదలు పెద్దల వరకు ప్రతీ ఒక్కరికీ జలుబు, దగ్గు, జ్వరం కామన్ అయిపోయాయి. దీంతో దగ్గర్లోని మందుల షాపుకు వెళ్లి చాలా మంది మాత్రలు, సిరప్‌లు వేసుకుంటున్నారు. ఓవర్ కౌంటర్ మెడికల్ సేల్స్ చాలా మందిలో ప్రాణాంతకంగా మారుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరీ ముఖ్యంగా దగ్గు టానిక్ (కాఫ్ సిరప్), పారాసెటమాల్ ట్యాబ్‌లెట్లు, ఇతర యాంటిబయోటిక్ మాత్రల వినియోగం ఇష్టానుసారంచేస్తే ఐసీయూలో చేరాల్సిన పరిస్థితులు రావొచ్చని, ప్రాణాలకే ప్రమాదంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇటీవలి కాలంలో తెలంగాణ వ్యాప్తంగా కౌంటర్ మెడికల్ సేల్స్ పెరిగిపోయాయి. జ్వరం, జలుబు, దగ్గు వస్తే చాలా మంది వైద్యుల వద్దకు వెళ్లడం లేదు. కనీసం చిన్నారులకు ఈ అనారోగ్య లక్షణాలు ఉన్నా వైద్యుడికి చూపించడం లేదు. మెడికల్ షాప్‌కు వెళ్లి షాప్‌లో ఇచ్చిన కాఫ్ మందులు, పారాసిటమాల్ సిరప్‌లను చిన్నారులకు వాడుతున్నారు. దీంతో చిన్నారుల ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా విషమిస్తున్న సందర్భాలు కోకొల్లలుగా నమోదవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనారోగ్యం ప్రారంభంలో కౌంటర్ మెడిసన్స్ తో చాలా మంది చిన్నారుల ఆరోగ్యం విషమిస్తోంది. ఎమర్జెన్సీ వార్డుల్లో ఉంచి చికిత్స అందించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. చిన్నారుల కోసం వినియోగించే కాఫ్, పారాసిటమాల్, యాంటిబయోటెక్ సిరప్‌లతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాప్‌లో కొనుక్కొచ్చిన కాఫ్ సిరప్ పట్టించాక చాలా మంది చిన్నారులు పాలు తాగిన వెంటనే వాంతులు చేసుకుంటున్నారు. ఆ పరిస్థితుల్లో చిన్నారులకు ప్రత్యేకమైన వైద్య చికిత్స అవసరమవుతోంది. కాఫ్ సిరప్ పట్టించిన చిన్నారులు ఆడుకుంటూ కండ్లు తిరిగి పడిపోవడం పరిపాటిగా మారుతోంది. దగ్గు టానిక్‌లలో ఉండే డెక్స్రో మెథ్రోఫాన్ అనే పదార్థంతో మత్తుతోపాటు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చిన్నారుల విషయంలో ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా వైద్యుడిని సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇష్టానుసారంగా కౌంటర్ మెడిసన్స్ వాడితే చిన్నారుల్లో క్రమంగా యాంటిబయోటెక్ ఔషధాలు పనిచేయకుండా పోయే ప్రమాదముందని, ఇదే జరిగితే భవిష్యత్‌లో వారు అనేక ఇబ్బందులు ఎర్కొవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కొన్నిసార్లు కాలేయ వైఫల్యం, కోమాలోకి వెళ్లిపోవడం, అప్పడప్పుడూ ఉన్నట్టుండి స్పృహ కోల్పోవడం, వాంతులు కావడం జరుగుతాయని హెచ్చరిస్తున్నారు

సమాజ్‌వాది పార్టీలో చేరిన బీఎస్పీ, బీజేపీ ఎమ్మెల్యేలు

లక్నో అక్టోబర్ 30:అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో విపరీత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే కప్ప దుంకుడులు ప్రారంభమవగా.. తాజాగా బీఎస్పీ, బీజేపీ ఎమ్మెల్యేలు సైకిలెక్కారు. బీఎస్పీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆరుగురు ఎమ్మెల్యేలతోపాటు బీజేపీకి చెందిన ఎమ్మెల్యే కూడా అఖిలేష్ యాదవ్ సమక్షంలో సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. ఎస్పీలో చేరిన ఎమ్మెల్యేలలో బీఎస్పీ నుంచి సస్పెండైన హరగోవింద్ భార్గవ్, ముజ్తబా సిద్ధిఖీ, హకీమ్ లాల్ బింద్, అస్లాం రైనీ, సుష్మా పటేల్, అస్లాం చౌదరి, బీజేపీ నుంచి సీతాపూర్ ఎమ్మెల్యే రాకేశ్ రాథోడ్ ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం.

గత ఏడాది జరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలో క్రాస్ ఓటింగ్ బయటపడిన తర్వాత ఆరుగురు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి మాయావతి సస్పెండ్ చేశారు. వీరంతా అఖిలేష్ యాదవ్‌ను కలిసి ఎస్పీకి మద్దతు ప్రకటించారు. తమ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలను ఎస్పీలో చేర్చుకోవడంపై మాయావతి మండిపడ్డారు. ఇది అఖిలేష్ ఆడుతున్న "డ్రామా" అని వ్యాఖ్యానించారు. 'సమాజ్‌వాది పార్టీతోపాటు ఓ పారిశ్రామికవేత్తతో కుమ్మక్కైన వీరంతా తాము నిలిపిన దళిత అభ్యర్థిని రాజ్యసభ ఎన్నికల్లో ఓడించారు. అందుకే వీరిని చాలా కాలం క్రితం బీఎస్పీ నుంచి సస్పెండ్ చేశాం' అని బీఎస్పీ అధినేత ట్వీట్ చేశారు.

అంతర్జాతీయ సమస్యలపై భారతదేశం నాయకత్వానికి జి-20 గుర్తింపు, పలు అంశాలపై భారత అభిప్రాయాలకు మద్దతు - శ్రీ పీయూష్ గోయెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:"ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై భారతదేశం నాయకత్వాన్ని జి-20 దేశాలు ఆమోదించాయి. రాబోయే జి-20 శిఖరాగ్ర సమావేశం చర్చకు రానున్న పలు అంశాలపై భారతదేశ వైఖరికి మద్దతు ఇచ్చాయి" అని ఇటీవల ముగిసిన జి-20 షెర్పాల సమావేశం వివరాలను మీడియాకు వివరిస్తూ శ్రీ పీయూష్ గోయెల్ తెలిపారు.

రోమ్ డిక్లరేషన్ కు తుది రూపం ఇవ్వడానికి ఇటీవల ముగిసిన షెర్పాల సమావేశం అజెండాను నాయకుల శిఖరాగ్ర సమావేశం ఆమోదిస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ తనకు అందిన ఇటలీ ప్రధానమంత్రి మారియో డ్రాఘి ఆహ్వానాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఉదయమే రోమ్ చేయారు.

ఇది ప్రధానమంత్రి 8వ జి-20 సమావేశం.

జి-20 సమావేశంలో ప్రధానమంత్రి భాగస్వామ్యానికి అవసరమైన తుది ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు శ్రీ పీయూష్ గోయెల్ మూడు రోజులోగా రోమ్ లోనే ఉన్నారు.

రోమ్ లో శ్రీ పీయూష్ గోయెల్ ఈ నెల 27-29 తేదీల మధ్య జరిగిన జి-20 షెర్పాల సమావేశంలో పాల్గొన్నారు. జి-20 దేశాలకు చెందిన పలు దేశాల (యుకె, జర్మనీ, ఫ్రాన్స్, ఇయు, ఇండోనేసియా, సింగపూర్ (ఎఫ్ఎం) వాణిజ్య మంత్రులతో ఆయన సమావేశమయ్యారు. అంతర్జాతీయ సహకారానికి సంబంధించి ప్రపంచ స్థాయిలో కీలకమైన వేదికగా జి-20 ఎదిగిందని శ్రీ గోయెల్ అన్నారు. ప్రపంచ జిడిపిలో 80 శాతానికి, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతానికి, ప్రపంచ జనాభాలో 60 శాతానికి జి-20 ప్రాతినిధ్యం వహిస్తున్నదని ఆయన చెప్పారు.

"మహమ్మారి నుంచి రికవరీ, ప్రపంచ ఆరోగ్య పాలనా వ్యవస్థ పటిష్ఠత, ఆర్థిక రికవరీ, సంయమనం, వాతావరణ మార్పులు, ఇంధన పరివర్తన, సుస్థిర అభివృద్ధి, ఆహార భద్రత" లక్ష్యాలుగా ఈ ఏడాదికి నిర్దేశించిన "ప్రజలు, భూగోళం, సుసంపన్నత" అనే థీమ్ తో ముందుకు సాగుతున్న జి-20 కి ప్రస్తుతం అధ్యక్ష స్థానంలో ఇటలీ ఉంది.

ఇటలీ ఎంపిక చేసిన ప్రాధాన్యతా అంశాలకు భారతదేశం పూర్తి మద్దతు ఇస్తున్నదని మీడియాతో మాట్లాడుతూ శ్రీ గోయెల్ చెప్పారు. రోమ్ డిక్లరేషన్ కు తుది రూపం ఇవ్వడానికి ఇటీవల జరిగిన షెర్పాల సమావేశం అజెండాను జి-20 శిఖరాగ్ర సదస్సులో నాయకులు ఆమోదిస్తారని ఆయన తెలిపారు.

భారతదేశం ఉద్ఘతంగా చేపట్టిన కోవిడ్-19 టీకాల కార్యక్రమం ప్రపంచం శ్రేయస్సు కోసమేనని జి-20 దేశాలు ఆమోదించాయని, టెస్టింగ్ ఫలితాలు, వ్యాక్సిన్ సర్టిఫికెట్లు సహా ప్రయాణ పత్రాలను పరస్పరం గుర్తించుకోవాలంటూ ఈ సందర్భంగా తాను చేసిన ప్రతిపాదనను జి-20 సహచరులు ఆమోదించడం ఆనందదాయకమని మంత్రి అన్నారు.

సుస్థిర అభివృద్ధి, ఆహార భద్రత విషయానికి వస్తే చిన్నకారు, సన్నకారు రైతుల ప్రయోజనాలు, స్థానిక ఆహారపు అలవాట్లు పరిరక్షించేవిగా విధానాలుండాలని, అప్పుడే ఆహార భద్రత సాధ్యమవుతుందని భారతదేశం నొక్కి చెప్పిందని ఆయన తెలిపారు.

ఒకే రకమైన, దీర్ఘకాలిక ప్రపంచ వాతావరణ కార్యాచరణ ప్రణాళిక; రాయితీలతో కూడిన వాతావరణ ఆర్థిక సహాయం; సుస్థిరమైన, అందరికీ అందుబాటు ధరల్లో టెక్నాలజీ అందుబాటు; సుస్థిర జీవనశైలి విధానాలు, బాధ్యతాయుతమైన వినియోగ విధానాలతోనే వాతావరణ మార్పులు, పర్యావరణం విషయంలో పటిష్ఠమైన అడుగు పడుతుందని, అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇందుకు కట్టుబడాలన్న అంశంతో పాటు ఎస్ డిజి-12 లక్ష్యాల ప్రాధాన్యత గురించి కూడా భారతదేశం గట్టిగా వాదించిందని శ్రీ గోయెల్ తెలిపారు.

కోవిడ్ అనంతర ఆర్థిక రికవరీకి, సమాజంలో నిరాదరణకు గురవుతున్న వర్గాల సహాయానికి ప్రకటించిన మద్దతు చర్యలు ముందస్తుగా ఉపసంహరించకుండా జి-20 ఫ్రేమ్ వర్క్ వర్కింగ్ గ్రూప్ సహాధ్యక్ష హోదాలో ఇండియా కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అలాగే ప్రస్తుత కోవిడ్ నేపథ్యంలో ప్రకటించిన రుణ సర్వీస్ నిలుపుదల చర్యలను 2021 సంవత్సరం చివరి వరకు కొనసాగించేందుకు, తద్వారా ప్రపంచంలోని పేద ప్రజలకు ఊపిరి పీల్చుకునే అవకాశం ఇచ్చేందుకు జి-20 అంగీకరించిందని తెలిపారు. పన్ను సంస్కరణలపరంగా లాభాలు ఆర్జిస్తున్న ప్రదేశాలు, వాటిపై పన్నులు విధిస్తున్న ప్రాంతాల్లోని అసతుల్యతను తొలగించాలని భారతదేశం ప్రతిపాదించిందన్నారు. ఇలా చేయడం వల్ల భారీ ఎంఎన్ సిలు తాము కార్యకలాపాలు సాగిస్తున్న దేశంలో తక్కువ కార్పొరేట్ పన్ను చెల్లించే వీలు కలుగుతుందని భారతదేశం వాదం వినిపించినట్టు శ్రీ గోయెల్ చెప్పారు.

ఈ సంవత్సరానికి జి-20 అవినీతి నిరోధక కార్యాచరణ బృందం కో చైర్ హోదాలో భారతదేశం ఆస్తుల రికవరీ, సమాచార మార్పిడి, చట్టాల అమలులో సహకారం, సాంకేతిక పరిజ్ఞానం, పన్ను స్వర్ధధామాల నిరాకరణ అనే ఐదు అంశాలను ప్రతిపాదించిందని శ్రీ గోయెల్ తెలిపారు.

మహిళా సాధికారతకు జి-20 ప్రాధాన్యం ఇవ్వాలన్న అంశానికి భారతదేశం గట్టిగా మద్దతు ప్రకటించిందని వాణిజ్యం, టెక్స్ టైల్, వినియోగదారుల వ్యవహారాలు; ఆహారం, ప్రభుత్వ సరఫరా శాఖల మంత్రి తెలిపారు. లింగవివక్షాపూరితమైన దౌర్జన్యానికి వ్యతిరేక భాషను చేర్చాలని భారత్ గట్టిగా ప్రతిపాదించిందని, అలాగే "రిమోట్ పని ఏర్పాట్ల"కు సహాయపడే విధంగా జి-20 కొత్త పాలసీ విధానానికి మద్దతు ప్రకటించిందని ఆయన చెప్పారు.

కోవిడ్-19 కారణంగా విశేషంగా కుంగిపోయిన టూరిజం రంగం రికవరీ ప్రాధాన్యతను కూడా ప్రముఖంగా ప్రస్తావించినట్టు శ్రీ గోయెల్ తెలిపారు. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక వైభవ పరిరక్షణ అంశాల్లో జి-20 ఇస్తున్న ప్రాధాన్యతకు భారతదేశం మద్దతు ప్రకటించినట్టు చెప్పారు.

విశ్వసనీయతతో కూడిన గణాంకాలు అందరికీ అందుబాటులో ఉండాలని, ప్రధానంగా సీమాంతర డేటా ప్రవాహం, వర్ధమాన దేశాల అభివృద్ధి చొరవల మద్దతుకు అవకాశం కల్పించాలని భారతదేశం గట్టిగా కోరిందని మంత్రి తెలిపారు. "అభివృద్ధికి డేటా వినియోగం" అనే అంశంలో భారతదేశానికి జి-20 మద్దతు ఇవ్వడం అత్యంత సంతృప్తికరమైన అంశమని ఆయన చెప్పారు.

జి-20లో భారతదేశం మాట వర్ధమాన దేశాల మాటకు ప్రాతినిధ్యం వహిస్తుందని మంత్రి అన్నారు.

2020లో సౌదీ నాయకత్వ సమయంలో ప్రధానమంత్రి శ్రీ మోదీ సలహాను పురస్కరించుకుని కోవిడ్-19 పరిస్థితిపై గత ఏడాది జి-20 అసాధారణ సమావేశం నిర్వహించిందని ఆయన చెప్పారు.

ఆఫ్ఘనిస్తాన్ లో మానవతా సంక్షోభాన్ని పరిష్కరించడంలో జి-20 ప్రభావానికి మద్దతు ఇచ్చేందుకు ఈ ఏడాది ఇటలీ ప్రత్యేక శిఖరాగ్రం నిర్వహిస్తోంది. మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛ ప్రత్యేకించి మహిళలు, బాలలు, మైనారిటీలు, ఆఫ్ఘనిస్తాన్ లోని నిరాదరణకు గురవుతున్న వర్గాల ప్రజల హక్కులకు ఐక్యరాజ్యసమితి చార్టర్, ఇతర అంతర్జాతీయ నిబంధనల పరిధిలో జి-20 ప్రాధాన్యం ఇస్తోంది.

2022 డిసెంబర్ 1 నుంచి 2023 నవంబర్ 30 తేదీల మధ్య కాలానికి జి-20 అధ్యక్షతను భారతదేశం స్వీకరిస్తుందని శ్రీ గోయెల్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లో త్రికోణంలో ప్రవేశిస్తున్న సమయంలో వర్ధమాన దేశాలు, వర్ధమాన ఆర్థిక వ్యవస్థల సమస్యలు, ఆందోళనలపై నాయకత్వం దృష్టిని ఆకర్షించేందుకు భారతదేశం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

'భారతదేశంలో ఆరోగ్యబీమా చట్రం కిందకు రాని మధ్యస్థులు' విషయమై నివేదిక విడుదల చేసిన నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:నీతి ఆయోగ్ ఈరోజు భారతదేశంలో ఆరోగ్యబీమా చట్రం కిందకు రాని మధ్యస్థులకు ఆరోగ్య బీమా అనే పేరుతో ఒక సమగ్ర నివేదికను విడుదల చేసింది, ఇది భారతీయ జనాభా ఆరోగ్య బీమా కవరేజీలో ఉన్న అంతరాలను బయటకు తీసుకొచ్చింది. బీమా ఆరోగ్య కవరేజ్ పరిస్థితిని పరిష్కరించడానికి గల వివిధ పరిష్కారాలను సూచించింది.

నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ సర్వాల్ సమక్షంలో ఈ నివేదికను ఆవిష్కరించారు. నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్, ఈ బీమా నివేదిక ముందుమాట రాశారు. ఇందులో అందరికీ ఆరోగ్య బీమా కవరేజ్ యొక్క ఆవశ్యకతను ఎత్తిచూపుతూ "ఆరోగ్య బీమా వ్యాప్తిని విస్తరింపజేయడానికి ముఖ్యమైన సవాళ్లను అధిగమించవలసి ఉంటుంది" అని పేర్కొన్నారు.

"ఈ ప్రయత్నంలో ప్రభుత్వం మరియు ప్రైవేట్ రంగం కలిసి రావాలని పేర్కొన్నారు. తప్పిపోయిన మధ్య స్థాయి వారిని చేరుకోవడానికి మరియు ఆకట్టుకునే ఉత్పత్తులను అందించడానికి ప్రైవేట్ రంగ చాతుర్యం మరియు సామర్థ్యం ఎంతగానో అవసరమని పేర్కొన్నారు.

వినియోగదారుల అవగాహన, విశ్వాసాన్ని పెంపొందించడం, ఉత్పత్తులకు ప్రామాణికరించడం, వినియోగదారుల రక్షణకు తగు నియంత్రణను సవరించడం మరియు కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఒక వేదికను అందించడంలో ప్రభుత్వం ముఖ్యమైన పాత్ర ఉందని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ మాట్లాడుతూ "ఈ నివేదిక ఆరోగ్యానికి ఆర్థిక రక్షణను పెంచడం.. యూనివర్సల్ హెల్త్ కవరేజ్ యొక్క విస్తృత లక్ష్యంపై సంభాషణను తిరిగి ఉత్తేజపరిచే ప్రయత్నం.

ఈ నివేదిక ప్రస్తుత ఆరోగ్య బీమా రంగం, ఇప్పటికే ఉన్న ఖాళీలను వివరిస్తుంది. ఆరోగ్య బీమా కవరేజీని పెంచడానికి గాను విస్తృత సిఫార్సులు మరియు మార్గాలను వివరిస్తుంది. ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన? యూనివర్సల్ ఆరోగ్య బీమా కవరేజీకి సంబంధించిన ప్రధాన పథకాలు, మరియు రాష్ట్ర ప్రభుత్వ విస్తరణ పథకాలు? జనాభాలో దిగువన ఉన్న 50 శాతం మందికి సమగ్రమైన హాస్పిటలైజేషన్ కవర్‌ను అందిస్తున్నాయి. జనాభాలో దాదాపు 20 శాతం మంది సామాజిక ఆరోగ్య బీమా ద్వారా కవర్ చేయబడుతున్నారు.

ప్రైవేట్ స్వచ్ఛంద ఆరోగ్య బీమా ప్రధానంగా అధిక-ఆదాయ సమూహాల కోసం రూపొందించబడింది. మిగిలిన 30% జనాభా ఎలాంటి ఆరోగ్య బీమా లేని వారు వీరు "మిస్సింగ్ మిడిల్" అని పిలువబడుతున్నారు. మిస్సింగ్ మిడిల్ అన్ని ఖర్చుల క్వింటైల్‌లలో బహుళ సమూహాలను కలిగి ఉంది.

ఇది పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలోనూ విస్తరించి ఉంది. బీమా కవరేజ్ కిందకు రాని మధ్యస్థుల వారి కోసం తక్కువ-ధర కలిగిన సమగ్ర ఆరోగ్య బీమా ఉత్పత్తులను రూపొందించాల్సిన అవసరాన్ని నివేదిక హైలైట్ చేస్తుంది.

వీరి ఆరోగ్యానికి తక్కువ ఆర్థిక రక్షణ పాలసీ సమస్యను కూడా గుర్తిస్తుంది. దానిని తగిన విధంగా పరిష్కరించడంలో సంభావ్య మార్గంగా ఆరోగ్య బీమాను ప్రధానంగా వెలుగులోకి తెస్తుంది.

అలా చేయడం ద్వారా.. తప్పి

విజయగర్జన సభకు స్థల పరిశీలన చేసిన మంత్రి ఎర్రబెల్లి, వినోద్

వరంగల్, అక్టోబర్ 30:: టీఆర్ఎస్ విజయగర్జన సభ కోసం రాంపూర్ సమీపంలోని స్థలాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పరిశీలించారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి రెండు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా నవంబర్ 15న వరంగల్ లో విజయ గర్జన సభ నిర్వహించేందుకు పార్టీ భారీ సన్నాహాలు చేస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే నగరంలో మడికొండ, ఉనికిచర్ల, ఉర్సు రంగలీలా మైదానం సమీపంలోని పలు ప్రాంతాలను మంత్రి పరిశీలించిన మంత్రి.. తాజాగా వినోద్ కుమార్‌తో కలిసి రాంపూర్ సమీపంలోని స్థలాన్ని పరిశీలించారు.

అక్కడి రైతులతోనూ మాట్లాడారు. కాగా, టీఆర్ఎస్ విజయగర్జన సభను 10లక్షల మందితో విజయవంతం చేయడానికి, ఎలాంటి ఆటంకాలు కలుగకుండా అన్ని హంగులతో సభ నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ స్థాపించి 20 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ సాధించిన విజయాలను, ప్రభుత్వం సాధించిన ప్రగతిని సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులు, ప్రజలకు నివేదిస్తారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కాంగ్రెస్ అసమర్థత వల్లే మోదీ బలం పెరిగింది.. మండిపడ్డ మమతా బెనర్జీ

పనాజీ, అక్టోబర్ 30:: కాంగ్రెస్ అసమర్థత వల్లే మోదీ బలం పెరిగిందని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. దేశంలోని రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకోవడం లేదని, అందుకే బీజేపీ బలం పెరిగిందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్టానం సరైన నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు.

గోవాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆమె విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తోపాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా ఆమె మండిపడ్డారు. 'ఢిల్లీ చేసే దాదాగిరీ ఇక చెల్లదు' అని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం వల్లే దేశంలో పరిస్థితులు ఇలా తగలడ్డాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన ఆమె.. కాంగ్రెస్ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'ఈ విషయంలో నేను ఇప్పుడు ఏమీ మాట్లాడదలచుకోలేదు. ఎందుకంటే వాళ్లు రాజకీయాలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. కాంగ్రెస్ కారణంగా మోదీ బలం రోజురోజుకూ పెరిగిపోతోంది' అని ఆమె వ్యాఖ్యానించారు.

బీజేపీతో పోరాడే అవకాశం కాంగ్రెస్‌కు గతంలో వచ్చిందని, కానీ వాళ్లు దాన్ని అందిపుచ్చుకోలేదని తెలిపింది. కానీ కాంగ్రెస్ పార్టీ బెంగాల్ రాష్ట్రంలో తనకు వ్యతిరేకంగా పోరాడిందని ఆమె గుర్తుచేశారు. రాష్ట్రాలు బలంగా ఉన్నప్పుడే కేంద్రం బలంగా ఉంటుందని, కాబట్టి స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్యకి ఘనస్వాగతం.. ఏపీలో వారం రోజులు పర్యటన

అమరావతి, అక్టోబర్ 30:ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విజయవాడ చేరుకున్నారు. విజయవాడగన్నవరం ఎయిర్ పోర్ట్ లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, డీజీపీ గౌతమ్ సవాంగ్, మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టకి ఉపరాష్ట్రపతి వెళ్లారు. నేటి నుంచి వారం రోజుల పాటు పలు కార్యక్రమాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొనున్నారు.

ఏపీలో పెరుగుతున్న కరోనా కేసుల సంఖ్య

అమరావతి, అక్టోబర్ 30: ఆంధ్రప్రదేశ్‌లో యాక్టివ్ కొవిడ్ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతున్నాయి. కొత్తగా 481 మంది కేసులు చేరడంతో శుక్రవారం వరకు మొత్తం కేసుల సంఖ్య 4,837 కు చేరుకున్నాయి. కృష్ణా జిల్లాలో వరుసగా రెండో రోజు శుక్రవారం ఒక్కరే చనిపోయినట్లు అధికారులు తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, తూర్పు గోదావరిలో 157 కొత్త ఇన్‌ఫెక్షన్లు నమోదయ్యాయి. చిత్తూరు (76), కృష్ణ (52) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మిగిలిన 10 జిల్లాల్లో ఒక్కొక్కటి 50 కంటే తక్కువ కొత్త ఇన్‌ఫెక్షన్లు నమోదవుతున్నాయి. అనంతపురం, ప్రకాశం, కర్నూలు రోజువారీగా సింగిల్ డిజిట్ 6, 7, 8 కేసులు వస్తున్నాయి.

ఎనిమిది జిల్లాల్లో కొవిడ్ కేసుల సంఖ్య ఎక్కువగా నమోదైంది. మూడు ఉత్తర కోస్తా జిల్లాల్లో 75కి పైగా కొత్త కేసులు నమోదు కాగా, నాలుగు రాయలసీమ జిల్లాల్లో 100కి పైగా కొత్త కేసులు నమోదయ్యాయి. రికవరీలు 385కి చేరుకున్నాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 4,837కి పెరిగింది. తూర్పుగోదావరిలో కేసులు పెరిగిపోతుండగా.. కడపలో కేసుల సంఖ్య 100కి తగ్గడం కనిపించింది. మొత్తం మీద రాష్ట్రంలో ఇప్పటివరకు 2.94 కోట్ల నమూనాలను పరీక్షించారు. రికవరీలు 20.46 లక్షలకు పైగా ఉన్నాయి. మరణాల సంఖ్య ఇప్పుడు 14,367కి చేరుకున్నది. శుక్రవారం ఉదయం 9 గంటలతో ముగిసిన 24 గంటల్లో 39,000కు పైగా నమూనాలను పరిశీలించగా, 481 పాజిటివ్ కేసులు తేలాయి.

18 బిలియన్ అమెరికా డాలర్లు దాటిన - ఆయుష్ మార్కెట్ పరిమాణం

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:పెరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ డిమాండ్ వల్ల కలిగిన ఉత్సాహం, నియంత్రణ, పరిశోధన, అభివృద్ధి కి అందుతున్న బలమైన మద్దతు తో పాటు, కేంద్ర మంత్రిత్వ శాఖ ద్వారా లభిస్తున్న పూర్తి మౌలిక సదుపాయాల ఫలితంగా, 2014-20 మధ్య కాలంలో ఆయుష్ మార్కెట్ పరిమాణం 17 శాతం పెరిగి 18.1 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయికి చేరుకుందని, కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ శుక్రవారం తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన 'ఆయుర్-ఉద్యమ' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. "భారతదేశంలో ఆయుష్ రంగం : అవకాశాలు మరియు సవాళ్లు' శీర్షికతో ఆర్.ఐ.ఎస్. రూపొందించిన నివేదికను కేంద్రమంత్రి, ఈ సందర్భంగా, విడుదల చేశారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంకుర సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో, ఈ రంగంలో మొట్ట మొదటి ఇంక్యుబేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన, ఏ.ఐ.ఐ.ఏ. ఐ.సి.ఏ.ఐ.ఎం.ఈ. - అఖిల భారత ఆయుర్వేద సంస్థ - ఆవిష్కరణలు మరియు సంస్థల స్థాపన కోసం ఇంక్యుబేషన్ కేంద్రాన్ని, ఈ కార్యక్రమంలో భాగంగా, కేంద్ర ఆహార, ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పశుపతి పరాస్ జీ ప్రారంభించారు.

మహమ్మారి కారణంగా 2020లో ఆర్థిక కార్యకలాపాలు మందగించినప్పటికీ, ఈ పరిశ్రమ 2021 లో 20.6 బిలియన్ల అమెరికా డాలర్లకు, 2022లో 23.3 బిలియన్ల అమెరికా డాలర్లకు చేరుకుంటుందని, అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం పరిశోధన మరియు సమాచార వ్యవస్థ (ఆర్.ఐ.ఎస్) నివేదిక అంచనా వేసింది. అంతర్జాతీయ వాటా విషయానికొస్తే, ప్రపంచం తో పోలిస్తే ఆయుష్ మార్కెట్లో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందింది. మరియు మార్కెట్లో దాదాపు 2.8 శాతం వాటాను కలిగి ఉంది, ఉత్పత్తిలో అంతరాయాలను మినహాయించనప్పటికీ ఇది కలిగి ఉంటుంది.

అదే కాలంలో, వివిధ ఉత్పత్తి విభాగాలు మొత్తం పరిశ్రమ కంటే చాలా ఎక్కువ రేటు తో వృద్ధి చెందాయి. 2014-2020 మధ్య కాలంలో మొక్కల నుండి ఉత్పత్తి చేసిన ఔషధాలు 21 శాతం వృద్ధిని సాధించి ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానంలో 20.5 శాతం తో న్యూట్రాస్యూటికల్స్ (వైద్య, ఆరోగ్యపరమైన ప్రయోజనం గల ఆహార పదార్థాలు), 15.8 శాతం తో ఔషధాల తయారీకి సంబంధించిన పదార్థాలు), 14.7 శాతం తో మొక్కల నుంచి తీసిన పదార్థాలు, 14.3 శాతం తో మూలికా సంబంధమైన మొక్కలు ఉన్నాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ, గత ఒకటిన్నర సంవత్సరాలలో మహమ్మారి మొదటి మరియు రెండవ దశ ఉధృతి సమయంలో ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 రోగులు వేగంగా కోలుకోవడంలో ఆయుష్ మందులు చాలా బాగా పనిచేశాయని చెప్పారు.

కొత్త ఇంక్యుబేషన్ సెంటర్ గురించి శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ, అంకురసంస్థలు దేశంలో కొత్త రకాల సంపద సృష్టికర్తలని పేర్కొన్న, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని ప్రస్తావించారు. "భారతదేశ అంకుర సంస్థలతో పాటు, అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచంలోనే అత్యుత్తమంగా మార్చడానికి ప్రభుత్వం అవిశ్రాంతంగా పని చేయవలసిన అవసరాన్ని ప్రధానమంత్రి వివరించారు. ఇది ఆత్మనిర్భర భారత్ యొక్క దీర్ఘకాలిక దార్శనికతకు దోహదం చేస్తుంది." అని సోనోవాల్ చెప్పారు.

కొత్త ఆలోచనలు అభివృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణం అవసరమని, యువ పారిశ్రామికవేత్తలు వారి సంస్థలను పెంపొందించుకోడానికి ముందు వారు పూర్తిగా నిలదొక్కుకోడానికి కేంద్రం సహాయపడుతుందని మంత్రి తెలియజేశారు. "ఆవిష్కరణలను వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తులు, సేవల రూపంలోకి మార్చుకోడానికి అంకురసంస్థల కార్యక్రమం ఆయుష్ వ్యవస్థాపకులకు సహాయపడుతుందని నేను ఆశిస్తున్నాను. ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, శ్రీ రాజేష్ కోటేచా; ఏ.ఐ.ఐ.ఏ. డైరెక్టర్, ప్రొఫెసర్ తనూజా మనోజ్ నేసరి నాయకత్వంలో ఏ.ఐ.ఐ.ఏ. కి చెందిన మొత్తం బృందం ఆయుష్ మంత్రిత్వ శాఖతో పాటు వాణిజ్య మంత్రిత్వ శాఖ, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వంటి భారత ప్రభుత్వం లోని ఇతర మంత్రిత్వ శాఖలతో, ఎం.ఎస్.ఎం.ఈ. తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. పరిజ్ఞానం ఇచ్చి పుచ్చుకునేందుకు, ఈ ఆహార అంకుర సంస్థలను ప్రారంభించాలనే కార్యక్రమం, ఒక ఆదర్శవంతమైన వేదిక అవుతుంది." అని శ్రీ సోనోవాల్ పేర్కొన్నారు.

ప్రజారోగ్యం కోసం చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా మధుమేహ నివారణ, నిర్వహణకు దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులు సహకరించారని, మధుమేహ వ్యాధి నివారణ కోసం అనుసరించవలసిన నియమ నిబంధనల (ప్రోటోకాల్) తయారీలో ఏ.ఐ.ఐ.ఏ. కూడా పనిచేస్తోందని, కేంద్ర మంత్రి తెలిపారు. "మధుమేహ వ్యాధిగ్రస్తుల సంరక్షణ అవసరాలను తీర్చడానికి, అదేవిధంగా ఈ రంగంలో ఇటీవలి పురోగతిని తెలుసుకోవడానికి, అభ్యాసకులు, పరిశోధనలు చేసేవారు, విద్యావేత్తలకు ఈ ప్రోటోకాల్ సహాయపడుతుంది." అని ఆయన చెప్పారు.

ఏ.ఐ.ఐ.ఏ. రక్త నిధిని ప్రారంభించిన సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి శ్రీ ముంజ్ పరా మహేంద్రభాయ్ మాట్లాడుతూ, ఢిల్లీతో పాటు పరిసర రాష్ట్రాల రోగుల అవసరాలను ఈ రక్తనిధి తీరుస్తుందని చెప్పారు. "రక్త నమూనాలను దానం చేస్తున్నప్పుడు దాత సురక్షితంగా భావించడం చాలా ముఖ్యం. నైపుణ్యం కలిగిన, శిక్షణ పొందిన వైద్యుల ఆధ్వర్యంలో, ఏ.ఐ.ఐ.ఏ. లో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో, రక్తాన్ని స్వీకరించడానికి, దానం చేయడానికి ముందు దాతలు, రోగులను అందరినీ, సమగ్రంగా పరీక్షించేలా మేము నిర్ధారిస్తాము." అని ఆయన హామీ ఇచ్చారు.

కేంద్ర ఆహార, ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పశుపతి పరాస్ జీ, ఏ.ఐ.ఐ.ఏ-ఐ.సి.ఏ.ఐ.ఎన్.ఈ. ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో - పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తెలి; ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శ్రీ శంతను కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆర్.ఐ.ఎస్-ఎఫ్.టి.ఐ.ఎం. పత్రికను కూడా ఆవిష్కరించారు. వీటితోపాటు, బాల రక్ష కిట్ ను, పిల్లలకు రోగ నిరోధక శక్తిని పెంపొందించే స్వర్ణ ప్రాశనాన్ని కూడా, ఏ.ఐ.ఐ.ఏ. ఆవిష్కరించింది. ఆయుష్ సబ్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (హెచ్.ఎస్.ఎస్.సి) కింద క్వాలిఫికేషన్ ప్యాక్‌లతో పాటు, 2018-2021 సంవత్సరాల్లో అత్యుత్తమ ప్రతిభ తో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు.

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నవంబర్ 2వ తేదీని 6వ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకుంటోంది. ఆ రోజు జైపూర్ లోని జాతీయ ఆయుర్వేద సంస్థ లో భారీ కార్యక్రమాలతో సహా అనేక కార్యక్రమాలను నిర్వహించాలని యోచిస్తోంది.

వాతావరణాన్ని కలుషితం చేయని ఇంధన వినియోగాన్ని ఎక్కువ చేయడానికి ఇంధన పరిరక్షణ చట్టం 2001లో సవరణలు ప్రతిపాదించిన విద్యుత్ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:దేశంలో పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించి ఉత్పత్తి అవుతున్న విద్యుత్ వినియోగాన్ని ఎక్కువ చేయడానికి ఇంధన పరిరక్షణ చట్టం 2001 కి సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న ఇంధన వినియోగ అంశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రంగాల్లో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరిగేలా చూడాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ ప్రతిపాదనలు చేసింది. పరిశ్రమలు, భవన నిర్మాణం, రవాణా లాంటి రంగాల్లో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ఎక్కువ చేయడానికి వీలుగా చట్టంలో సవరణలు ప్రతిపాదించడం జరిగింది.

విద్యుత్ రంగంతో సంబంధం ఉన్న వర్గాలతో చర్చలు జరిపిన తరువాత విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలకు రూపకల్పన చేసింది. ఒక సంస్థ లేదా పరిశ్రమలో వినియోగించే విద్యుత్ లో పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి ఉత్పత్తి చేసే విద్యుత్ కనీస వినియోగం ఏమేరకు ఉండాలన్న అంశాన్ని నిర్దేశిస్తూ చట్టంలో మార్పులు చేయాలని ప్రతిపాదించారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే విధంగా ఇంధనాన్ని వినియోగించే సంస్థలకు కార్బన్ సేవింగ్ సర్టిఫికెట్ రూపంలో ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుంది. చట్టంలో ప్రతిపాదించిన ఇటీవల సమీక్షించిన విద్యుత్ శాఖ మంత్రి శ్రీ ఆర్.కే.సింగ్ వీటిపై సంబంధిత మంత్రిత్వ శాఖలు/ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సలహాలు, సూచనలను పొందాలని అధికారులను ఆదేశించారు. దీనికి అనుగుణంగా విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీ అలోక్ కుమార్ 2021 అక్టోబర్ 28 వ తేదీన మంత్రిత్వ శాఖలు, సంస్థలతో చర్చలు జరిపి సవరణలకు తుది రూపు ఇచ్చారు.

చట్టాన్ని సమగ్రంగా పరిశీలించడానికి నాలుగు సమావేశాలను (జాతీయ స్థాయిలో ఒక చర్చా వేదిక , మూడు ప్రాంతీయ సదస్సులు) విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ సమావేశాలలో అన్ని అంశాలను చర్చించి ప్రతిపాదించిన సవరణలను చర్చించి సంబంధిత వర్గాల అభిప్రాయాలను మంత్రిత్వ శాఖ సేకరించింది. సవరణల ప్రభావం ప్రత్యక్షంగా ఉండే సంస్థలకు కూడా వీటిని వివరించి వాటి అభిప్రాయాలను మంత్రిత్వ శాఖ తీసుకుంది. ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణల వల్ల దేశంలో కార్బన్ మార్కెట్ అభివృద్ధి సాధిస్తుంది. గ్రిడ్ ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిర్ధారించిన పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం జరుగుతుంది. దీనివల్ల శిలాజాల ఇంధన వనరుల వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

వాతావరణంలో మార్పులకు అనుగుణంగా ఇంధన వినియోగంలో మార్పులు తీసుకు రావడానికి ప్రపంచ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలలో భారతదేశం ముందున్నది. 2005 నాటి పరిస్థితులకు అనుగుణంగా 2030 నాటికి ఉద్గారాల విడుదలను 33-35% వరకు తగ్గించాలని భారతదేశం లక్ష్యంగా నిర్ణయించుకుని దీనికి అనుగుణంగా చర్యలను అమలు చేస్తోంది. 2030 నాటికి మొత్తం ఇంధన అవసరాలలో 40 శాతం అవసరాలను శిలాజ-ఇంధనేతర ఇంధన వనరులను వినియోగించి ఉత్పత్తి చేయాలని విధ్యుత్ మంత్రిత్వ శాఖ లక్ష్యంగా నిర్ణయించుకుని కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఇంధన వినియోగ సామర్థ్యాన్ని ఎక్కువ చేసి 2030 నాటికి కార్బన్ డయాక్సైడ్ విడుదలను 550 ఎంటీ సీవో2 కి తగ్గించగల సామర్థ్యాన్ని దేశం కలిగి ఉంది. చట్టంలో ప్రతిపాదించిన సవరణల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో కాలుష్య సమస్య లేని ఇంధన వినియోగం పెరుగుతుంది. శిలాజాల ఇంధన వనరుల వినియోగం తగ్గి గ్రీన్ హైడ్రోజన్ ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా అందుబాటులోకి వస్తుంది.

వాతావణం కలుషితం కానీ విధంగా ఇంధన వనరులను వినియోగించే సంస్థలకు ప్రోత్సహకాలు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రైవేట్ రంగాన్ని కూడా పర్యావరణ పరిరక్షణలో పాల్గొనేలా ప్రోత్సహిస్తాయి. భారీ నివాస భవనాలను కూడా చట్ట పరిధిలోకి తీసుకుని రావాలన్న ప్రతిపాదన వల్ల సుస్థిర ఆవాస ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి అవకాశం కలుగుతుంది.

అన్ని రంగాలలో చోటు చేసుకుంటున్న అభివృద్ధి వల్ల ఇంధన వినియోగం తప్పనిసరిగా పెరుగుతుందని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఖచ్చితంగా చెబుతోంది. దేశ ఇంధన అవసరాలను పూర్తిగా చర్యలను అమలు చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యం దెబ్బ తినకుండా చూడడానికి చర్యలను అమలు చేయవలసి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇంధన పరిరక్షణ చట్టం 2001 కి ప్రతిపాదించిన సవరణల వల్ల పారిస్ ఒప్పందం అమలుకు దేశం అమలు చేస్తున్న చర్యలకు సంస్థలు తమ సహాయ సహకారాలను అందించడానికి అవకాశం కలుగుతుంది. కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి వీలవుతుంది.

పోడు భూముల సమస్యపై మంత్రి సత్యవతి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం

ములుగు, అక్టోబర్ 30: పోడు భూముల సమస్య పరిష్కారం, అడవుల సంరక్షణకు సంబంధించి ములుగు జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో అఖిలపక్ష సమావేశం జరిగింది.

రాష్ట్ర గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలో ఈ సమావేశం నిర్వహించారు.

ఈ అఖిలపక్ష సమావేశానికి ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ శ్రీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ వైస్ చైర్మన్ నాగజ్యోతి, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ సంగ్రామ్ సింగ్, అఖిలపక్ష నేతలు, అధికారులు హాజరయ్యారు.

పేదవిద్యార్థికి ఆర్థికసాయం.. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ఔదార్యం..

భూపాలపల్లి, అక్టోబర్ 30: జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఆశతో కాకుండా,ఆశయంతో ముందుకు సాగాలని ములుగు,భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ తెలిపారు. ఓ నిరుపేద విద్యార్థిని పై చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందించి సహృదయన్ని చాటుకున్నారు. భూపాలపల్లి జిల్లా,మొగుళ్ళపల్లి మండలం,రంగాపురం గ్రామానికి చెందిన చిలువేరు ప్రవళిక అనే విద్యార్థిని గుజరాత్ లోని (ఔఈఆజ) (నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీలో) సైబర్ సెక్యూరిటీ, బీటెక్,ఎంటెక్,కంప్యూటర్ సైన్స్ ఉ ఇంజనీరింగ్ లో సీటు సాధించింది.

అందుకు రెండు లక్షల ముప్పై వేల రూపాయలు ఖర్చు అవుతుంది. తల్లిదండ్రులు రోజు వారి కూలీలు కావడంతో కట్టలేని పరిస్థితి..దీంతో దాతల సహకారం కోసం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ ని ఆశ్రయించగా తన కుటుంబ సభ్యుల సహకారం మరియు సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఉ పౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవళిక చదువు కోసం 10 పది వేల రూపాయలు అందించారు. అనంతరం తస్లీమా మాట్లాడుతూ చదువుతోనే అన్ని రంగాలలో రాణించవచ్చని,చదువే పేదరికాన్ని దూరం చేస్తుందని తస్లీమా అన్నారు..సర్వర్ చారిటబుల్ ట్రస్టు ఉ పౌండేషన్ సభ్యులు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన జీయర్ ప్రవచనాలు అమృతవాక్కులు : మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 30:: త్రిదండి చినజీయర్ స్వామి ప్రవచనాలు అమృతవాక్కులని, అద్భుతమైన సందేశాలను సైతం అలవోకగా చెప్పడంలో ఆయనకు ఆయనే సాటని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం జీయర్‌స్వామి తిరునక్షత్ర (జన్మదినం) వేడుకలు సందర్భంగా జిల్లాకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆండాళ్ గోష్ఠి, వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు మంత్రి చేతుల మీదుగా చీరెలు పంపిణీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి జీయర్‌స్వామి తిరునక్షత్రం వేడుకలు జరుపుకోవడం ఆనందంగా మహదానందంగా ఉందన్నారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలతో పాటు ఆధునిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకున్న ఏకసంతాగ్రహి జీయర్‌స్వామి అని కొనియాడారు. ఈ సందర్భంగా భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణకు దోహదపడే పలు కార్యక్రమాలు చేపడుతున్న ఆండాళ్ గోష్ఠి, వికాసతరంగిణి కార్యకర్తలను మంత్రి అభినందించారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉప్పల లలితా ఆనంద్, పట్టణ టీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులుగౌడ్, పెద్ద గట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు మొరిశెట్టి శ్రీనివాస్ , ఉప్పల ఆనంద్, కక్కిరేని నాగయ్య గౌడ్, మహిళా టీఆర్ఎస్ అధ్యక్షురాలు కరుణశ్రీ , ఆండాళ్ గోష్ఠి, వికాస తరంగిణి సభ్యులు శ్రీరంగం వల్లి, హైమావతి, పద్మ, ఉప్పల గోపాల కృష్ణ, విజయ్ కుమార్, శంకర్, రాము, వెంపటి రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, భక్త బృందం పాల్గొన్నారు.

చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌ను నన్ను ఎలా అడ్డుకుంటారు? : కౌశిక్‌రెడ్డి

హుజురాబాద్, అక్టోబర్ 30: 'నేను టీఆర్ఎస్ పార్టీ నుంచి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా ఉన్నాను. నాకు పోలింగ్ బూతుల వద్దకు వెళ్లే అధికారం ఉంది. నన్ను బీజేపీ వాళ్లు ఎలా అడ్డకుంటారు? ఎందుకు అడ్డుకుంటారు? కేవలం ఓడిపోతామనే ఫ్రస్ట్రేషన్‌తోనే ఇలా ప్రవర్తిస్తున్నారు. బీజేపీ నేతలకు ప్రజలు కచ్చితంగా ఓటుతో బుద్ధి చెబుతారు' అని టీఆర్ఎస్ నేత పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు.

హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా ఆయన పలు పోలింగ్ బూతులను సందర్శిస్తుంటే పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లు బీజేపీ నేతలు చిత్రీకరించారని మండిపడ్డారు కౌశిక్‌రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నేను టీఆర్ఎస్ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా ఉన్నా. నాకు రాజ్యాంగం ప్రకారం 305 పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉంది. నా వెనుక టీఆర్ఎస్ కార్యకర్తలు ఎవ్వరూ లేరు. అయినా బీజేపీ నేతలు ఎందుకు అడ్డుకుంటున్నారు? కేవలం ఓడిపోతామనే ఫ్రస్ట్రేషన్‌తోనే బీజేపీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారు' అని మండిపడ్డారు.

ఎస్పీ గూటికి చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలు!

లక్నో, అక్టోబర్ 30:: యూపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్

కార్మిక సంక్షేమ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యేకు వినితపత్రం

-కార్మిక సమస్యలు పరిష్కరించండి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో దాదాపు 10000 వేల మంది బిల్డింగ్ నిర్మాణ రంగంలో వివిధ వృత్తుల్లో కార్మికులుగా పనిచేస్తున్నారని వీరు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు నిరక్షరాస్యులుగా కావడం వల్ల వారికి లేబర్ యాక్ట్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందే సంక్షేమ పథకాలు పూర్తిగా తెలుసుకోలేకవాటిని లబ్ధి పొందలేక పోతున్నారని, ఇలాంటి కార్మికులందరికీ లేబర్ కార్డు తీసుకునే విధంగా అవగాహన కల్పించేలా గ నియోజకవర్గంలో కార్మిక సంక్షేమ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆదివారం వేములవాడ సుతారి కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు బొల్లం దేవరాజ్,అధ్యక్షులు రామతీర్థ పు రవి ఆధ్వర్యంలో సుతారి కార్మికులు ఎమ్మెల్యే రమేశ్ బాబు కు వినతిపత్రం అందజేశారు బిల్డింగ్ని నిర్మాణ కార్మికులకు తాపీ మేస్త్రీలకు పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయించేలా కృషి చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో సుతారి కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు జయరపు శ్రీధర్, కోశాధికారి జయరపు గంగయ్య, సలహాదారుడు ముక్కర రమేష్ , సభ్యులు చందు రాజుశ్రీను, సెంట్రీ గ సంఘం

నాయకులు కేరళ సత్తెమ్మ పొచె ట్లి నల్లరాజు, కొరెపు శ్రీను, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. .

ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ ఆస్పత్రిలో దీటుగా ప్రభుత్వం దీటుగా ప్రభుత్వం పెద్దఎత్తున పెట్టుబడి పెట్టడానికి ఆస్పత్రిలో మౌలిక వసతులను మెరుగుపర్చడానికి గొప్ప సేవలు ప్రణాళికను సిద్ధం చేసిందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబుఅన్నారునియోజకవర్గంలో రూ. 1.76 కోట్లతో మంజూరు అయిన 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో భాగంగా శనివారం మారుపాకలో భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పీ హెచ్.సీలకు ఒక ఎం.బి.బి.ఎస్ డాక్టర్ ఉంటారని, ఈ 11 పీ.హెచ్.సీలకు వేములవాడలో 100 పడకల ఆసు పత్రికి అనుసంధానంచేయబడతాయన్నారు. వేములవాడలో ఉన్న 100 పడకల ఆసుపత్రిలో 50 పడకలు సిద్ధంగా ఉన్నాయని, రోజుకు 300 మంది ఔట్ పేషంట్లు వస్తున్నారని అన్నారు. కరోనా భారీ పడ్డ పేషంట్లకు మెరుగైన వైద్యం అందించిందన్నారు. రానున్న రోజుల్లో విద్యా, వైద్యంలో ప్రభుత్వ పాత్ర గణనీయంగా పెరుగు తున్నదన్నారు. రానున్న కాలంలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్, మల్టీ పర్పస్ హాస్పటల్ రాబోతున్నా యన్నారు, రాబోయే రోజుల్లో వైద్యానికి పెద్ద పీట వేస్తామన్నారు.

స్కూళ్లను తనిఖీ చేసిన చెన్నమనేని!

శాసనసభ్యులు రమేష్ మారుపాక గ్రామంలోని ప్రాథమిక మరియు హై స్కూళ్లను తనిఖీ చేశారు. స్కూళ్లలో మౌలిక వసతుల ఏర్పాటుకు ఈ సంవత్సరంలో 2కోట్లు కేటాయిస్తానని మరో 1కోటి రూపాయలను సేవ్స్ ద్వారా నిధులు ద్వారా పాఠాశాలల్లో మౌలిక వసతులైన బెంచెస్,

టాయిలెట్స్, క్రీడా సామాగ్రి, కాంపౌండ్ వాల్స్, సైన్స్ పరికరాలు, ఇతరాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులతో, అంగన్వాడీ పిల్లలతో ముచ్చటించి వారికి పాఠశాలలో కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకు న్నారు. విద్యపై పెట్టె ఖర్చు భవిష్యత్తు పెట్టుబడేనని ఆన్నారు. ఈకార్యక్ర మాలలో జిల్లా పరిషత్ చైర్మన్ అరుణా రాఘవ రెడ్డి, ఎం.పీ.పీ బూర వజ్రమ్మ, సర్పంచ్ స్వయం ప్రభ, పాక్స్ చైర్మన్లు సల్మాన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఏ.ఎం.సీ చైర్మన్ హనుమాండ్లు, ఏ.ఎం.సీ వైస్ చైర్మన్ ఊరడి ప్రవీ ణ్, వైస్ ఎం.పీ.పీ ఆర్.సీ.రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎం.పీ.టీ.సీ లు, వివిధ శాఖల అధికారులు, విద్యా కమిటీ చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఔన్నత్యాన్ని చాటుకున్న సర్పంచ్ ,టీఆర్ఎస్ గ్రామశాఖ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గత రోజుల క్రితం మరణించిన పాముల పోచయ్య కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ ఉరడి రాంరెడ్డి, గ్రామ టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించడం జరిగింది , మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు .అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు టీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం , గ్రామ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి తన వ్యక్తిగత 25 కిలోల బియ్యం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నడిగొట్ల హరికృష్ణ , ఉపసర్పంచ్ తడెం శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఊరడి ప్రవీణ్,సింగిల్ విండో డైరెక్టర్ కట్ట ఎల్లయ్య టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఊరడి రాజిరెడ్డి (మెడికల్) ఉపాధ్యక్షుడు తడెం లచ్చయ్య, కోశాధికారి తుని కి కనుక రాజు',కార్మికశాఖ మండల అధ్యక్షులు తునికి నరేశ్,యువజన విభాగం ఉపాధ్యక్షులు పార్వతి భూమేష్, కార్యదర్శి నంతపుర్ మహిందర్ రెడ్డి , కోశాధికారి శనిదమగరాయి ,నాయకులు ధర్ పల్లె రవీందర్ , కుస మల్లయ్య ఎండీ బాసూ పార్వతి అంజయ్య తదితరులు పాల్గొన్నారు .

స్విఫ్ట్ ఆన్‌బోర్డింగ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టిన ఎక్సైటెల్

హైదరాబాద్ , అక్టోబర్ 30:దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బా)డ్ బ్యాండ్ నేటవర్క్‌లలో ఒకటైన ఎక్సైటెల్ దీపా వళి పండగ సందర్భంగా విప్లవాత్మక స్విఫ్ట్ ఆన్‌బోర్డింగ్ ప్లాన్ ను ప్రవేశపెట్టింది.

ఈ ప్లాన్ లో సంస్థ మొదటి మూడు నెలలకు కేవలం రూ. 500 ధరతో అన్ లిమిటెడ్ డేటాతో పాటు 200 ఎంబిపిఎస్ అప్ లోడ్ మరియు డౌన్ లోడ్ స్పీడ్‌ను అందిస్తుంది

. అంటే నెలకు రూ. 200 కన్నా తక్కువ ధరకే ఈ ప్లాన్ ను వినియోగదారులు పొంద గలరు.

ఇంతతక్కువ ధరకు ఈ రకమైన ఇంటర్నెట్ ఆన్‌బోర్డింగ్ ప్లాన్ దేశంలోనే మొదటిసారిగా ఎక్సైటెల్ అందిస్తుందని చెప్పవచ్చు. ఈ ప్లాన్ ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూర్ మరియు డిల్లీ లలో అమలులో ఉన్నది. అధిక ఆన్‌బోర్డింగ్ ధరల కారణం గా ఇంతవరకు అధికవేగం గల ఎఫ్‌టి టిహెచ్ సర్వీస్ అందుబాటులో లేని వినియోగదారుల సౌకర్యం కోసం ఈ ప్లాన్ ను ప్రవేశపెట్టినట్లు ఎక్సైటెల్ సంస్థ సిఈవో వివేక్ రైనా అన్నారు.

ఈవీ ట్రేడ్ ఎక్స్‌పో వద్ద ఎలక్ట్రిక్ మొబిలిటీ విప్లవానికి నేతృత్వం వహించిన ఈటీఓ మోటర్స్

హైదరాబాద్ , అక్టోబర్ 30: సుప్రసిద్ధ ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ కంపెనీ ఈటీఓ మోటర్స్, హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈవీ ట్రేడ్ ఎక్స్‌పోలో తన సత్తా చాటింది. ఈటీఓ మోటర్స్ తమ లాజిస్టిక్స్ వాహనాలు బల్కీ ప్లస్ మరియు ప్రయాణీకుల వాహనాలు ట్రైలక్స్ ఈ?వాహనాలను ప్రదర్శించడంతో పాటుగా సందర్శకులకు టెస్ట్ డ్రైవ్ కోసం అందుబాటులో ఉంచింది. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన ఈటీఓ మోటర్స్ , విద్యుత్ వాహనాలలో అగ్రగామిగా నిలువడమే కాదు, లాస్ట్ మైల్ ట్రావెల్ మరియు ఇంట్రాసిటీ లాజిస్టిక్స్ కార్యక్రమాల కోసం అనునరించే విధానంలోనూ సమూలమైన మార్పులను తీసుకురావాలనుకుంటుంది. ఈటీఓ మోటర్స్‌కు విస్తృత శ్రేణిలో ఉత్పత్తులు ఉన్నాయి. వీటిలో త్రీ వీలర్ పాసెంజర్ వాహనాలు, కార్గో వాహనాలతో పాటుగా 300 కిలోమీటర్ల పరిధి కలిగిన 4 వీలర్స్ కూడా ఉన్నాయి. ఈ కంపెనీ పలు వినూత్నమైన పథకాలు ప్రవేశపెట్టింది. దీనిలో ఒకటి ఓవైఈఎస్ (ఓన్ యువర్ ఈటీఓ స్కీమ్). ఇది వినూత్నమైన పథకం. డ్రైవర్లు యజమానులుగా మారడంతో పాటుగా స్థిరమైన ఆదాయం పొందవచ్చు. ఈటీఓ మోటర్స్ ఇప్పుడు చార్జింగ్ మౌలిక వసతుల సమస్యను సైతం పరిష్కరిస్తూ 30వేల మెగావాట్ల ఈవీ చార్జింగ్ మౌలిక వసతులను ఇప్పటి వరకూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక ఈటీఓ చార్జింగ్ హబ్ వద్ద 5మెగా వాట్ల సింగిల్ చార్జింగ్ స్టేషన్ సైతం ఉంది.ఈవీ ట్రేడ్ ఎక్స్‌పో గురించి ఈటీఓ మోటర్స్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ డెవలప్‌మెంట్, రాజీవ్ వైఎన్ఆర్ మాట్లాడుతూ "ఇటీవలి కాలంలో అత్యంత ఉత్సాహపూరితమైన ఆటోమొబైల్ మార్కెట్‌గా ఇండియా నిలుస్తుంది. 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆటోమోటివ్ మార్కెట్‌గా ఇండియా నిలుస్తుందని అంచనా. భారతీయ విద్యుత్ వాహన మార్కెట్ పరిమాణం 11.42 లక్షల కోట్ల రూపాయలకు చేరనుంది" అని అన్నారు.“భారతదేశంలో విద్యుత్ వాహన మార్కెట్ 2021 నుంచి 2030 మధ్య కాలంలో 94.4%తో వృద్ధి చెందుతుందని అంచనా. ఈ విద్యుత్‌వాహన విప్లవం తెలంగాణా నుంచి ఆరంభమయ్యేందుకు నేతృత్వం వహిస్తుండటం పట్ల సంతోషంగా ఉన్నాము" అని ఆయన జోడించారు.

అన్ని వర్గాలకు టీఆర్ఎస్ అండా : ఎమ్మెల్యే కృష్ణమోహన్

జోగులాంబ గద్వాల, అక్టోబర్ 30: : రాష్ట్రంలోని అన్నివర్గాలకు అండగా నిలిచిన పార్టీ టీఆర్ఎస్సేనని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల నియోజకవర్గంలోని గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండల కేంద్రాల్లో టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావమై 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే విజయగర్జన సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంత ంలో అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. రైతులు నీళ్లు, కరెంటు లేక ఎన్నో ఇబ్బందులుపడ్డారని గుర్తు చేశారు. నేడు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, చివరి ఆయకట్టుకు సాగునీరు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ తదితర ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు కొత్త వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టి రైతులకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు.

అలాగే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 20 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహిస్తున్న విజయగర్జన సభకు గద్వాల నియోజకవర్గంలోని టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు వరంగల్‌కు బయలుదేరి, విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎంపీపీ ఫోరం అధ్యక్షుడు విజయ్, పాక్స్ చైర్మన్ వెంకటేశ్, మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతు నాయుడు పాల్గొన్నారు.

ఆ రైతులకు అండగా టీటీడీ : చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

చిత్తూరు,అక్టోబర్ 30: తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాతీయ గో మహా సమ్మేళనం జరుగనున్నది. టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమ్మేళనాన్ని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. నేల తల్లిని రక్షించేందుకే ఈ మహాసమ్మేళనం నిర్వహిస్తున్నామని, గో ఆధారిత వ్యవసాయం చేసే రైతులకు టీటీడీ అండగా ఉంటుందని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి గో ఆధారిత ఉత్పత్తులను కొనుగోలు చేస్తామన్నారు. గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని టీటీడీ పాలక మండలిలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. సీఎం జగన్ సూచనల మేరకు టీటీడీ పాలక మండలి సనాతన హిందూ ధర్మ ప్రచారం చేస్తూనే, గో సంరక్షణ కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని చెప్పారు. రసాయన ఎరువులతో తయారుచేసిన దాణా తినే ఆవుల పాల వల్ల మహిళల్లో క్యాన్సర్ పెరుగుతున్నదని పలు అధ్యయనాల్లో తేలిందని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అందువల్లనే సీఎం జగన్ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

జాతీయ గో మహాసమ్మేళనం సందర్భంగా 24 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో నాలుగు స్టాల్స్ టీటీడీ ఆధ్వర్యంలో ఉత్పత్తి చేస్తున్న అగరబత్తులు, ఆయుర్వేద పంచగవ్య ఉత్పత్తులు, టీటీడీ ప్రచురణలు, డ్రై ఫ్లవర్ టెక్నాలజీతో తయారు చేసిన ఫొటోలను ఉంచారు. గో మహాసమ్మేళనానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి విచ్చేసిన రైతులకు తగిన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సమ్మేళనానికి హాజరైన రైతులకు సాంప్రదాయ భోజనం, త్రాగునీరు అందిస్తున్నారు. గుడికో గోమాత, శ్రీవారికి గో ఆధారిత నైవేద్యం, నవనీత సేవ, సప్త గో ప్రదక్షిణశాల వంటి కొత్త కార్యక్రమాలను తీసుకొచ్చి గోవు పట్ల ప్రజల ఆలోచన తీరులో మార్పు తీసుకురానున్నట్లు ఇటీవల మీడియా సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు.

పోడు భూముల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, అక్టోబర్ 30:: పోడు భూముల సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఈ దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్ కలెక్టరేట్‌లో మంత్రి ఎమ్మెల్యేలు, అఖిలపక్ష నేతలు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ విస్తీర్ణం, పోడు భూముల సమస్యలను అధికారులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారి జీవనోపాధికి ఇబ్బంది కలుగకుండా చూడడంతో పాటు సమస్యకు ఓ ముగింపు పలకాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని అడవులు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

గతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు జారీ చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఇంకా ఎంత మందికి, ఎన్ని ఎకరాలకు పట్టాలు అందించాలనే విషయమై సమగ్ర సమాచారం సేకరించాలని.. దీనిపై గ్రామ, డివిజనల్, జిల్లా స్థాయి కమిటీలు కసరత్తు చేయాలని ఆదేశించారు.

పోడు భూములు, అడవుల సంరక్షణ విషయాలపై ప్రభుత్వ నిబంధనలు, ఆర్ఓఎఫ్ఆర్ యాక్ట్‌లోని అంశాలను తప్పకుండా పాటించాలన్నారు. నవంబర్ 8 నుంచి డిసెంబర్ 8 వరకు పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులు, తదితరుల నుంచి క్లెయిమ్స్ స్వీకరించాలని సీఎం ఆదేశించి నేపథ్యంలో నవంబర్ 8లోగా వివిధ స్థాయిల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం.. గ్రామ కమిటీల నియామకం చేపట్టాలన్నారు.

రాష్ట్రంలో పోడు వ్యవసాయం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ ఒకటని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అటవీ భూమి ఎక్కువ ఉన్న క్రమంలో వాటిని కాపాడడంతో పాటు సమస్యను ప్రజలకు వివరించి.. సామరస్యపూర్వకంగా పరిష్కారం చూపాలన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి.. ఎవరెవరు వ్యవసాయం చేస్తున్నారనే వివరాలు పకడ్బందీగా సేకరించాలని సూచించారు. అటవీ, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. సమగ్ర అధ్యయనం తర్వాత సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు అర్హులకు భూములపై హక్కులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

సమస్య పరిష్కారమైన అనంతరం అడవుల పరిరక్షణ, పునరుజ్జీవ చర్యల్లో భాగంగా ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చూస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నేతలు, అధికారులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

సమావేశంలో ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రేఖా శ్యాంనాయక్, జడ్పీ చైర్ పర్సన్ కె విజయలక్ష్మి రెడ్డి, కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ అలీ, అఖిలపక్ష నేతలు, జిల్లా అటవీ, గిరిజన, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడి కూతురు వివాహ వేడుక...

- హాజరైన ప్రముఖులు...

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ పాషా కుమార్తె వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. కరీంనగర్ పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం రాత్రి జరిగిన వివాహ వేడుకలకు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో వేములవాడ శాసనసభ్యులు డాక్టర్ రమేష్ చెన్నమనేని, ఆందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్, మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్, టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి ఆది శ్రీనివాస్,శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సంకసాల మల్లేష్,గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వసంత, భాజపా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రతాప రామ కృష్ణ, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మారుతి సాగర్, హైదరాబాద్ యూనియన్ అధ్యక్షులు యోగానంద, ఉపాధ్యక్షులు బిజిగిరి శ్రీనివాస్, స్థానిక యూనియన్ జెర్రిపోతుల సంపత్, కరీంనగర్ అధ్యక్షులు బోనాల మల్లికార్జున్, కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్ యాదగిరి రావు, వేములవాడ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ రావు, రిటైర్డ్ డి.ఎస్.పి దామెర నరసయ్య, వేములవాడ సి ఐ ఓ వెంకటేష్, పలువురు సీఐలు, ఎస్సైలు, జెడ్పి చైర్ పర్సన్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు కాంగ్రెస్, భాజపా, తెరాస, సిపిఐ పార్టీ ల నాయకులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, పోలీసుశాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు, ఖాజా షరీఫ్ కుటుంబ సభ్యులతో పాటు వ్యాపారవేత్తలు, రియల్టర్లు, తదితరులు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు, అనంతరం ఏర్పాటు చేసిన విందు భోజన కార్యక్రమం లో పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వరాలయం మహిమాన్విత క్షేత్రం

నల్లగొండ, అక్టోబర్ 30: ప్రాచీన దేవాలయాలను పరిరక్షించాలని, నాటి వాస్తు, శిల్పకళను భవిష్యత్ తరాలకు అందించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రముఖ సాహితీవేత్త నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయ ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ జరిగిన ఆన్‌లైన్ అష్టావధానంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాచీన దేవాలయాలకు ప్రచారం కల్పించాలని 'తటవర్తి అవధానార్చన' కార్యక్రమంలో భాగంగా ఆస్ట్రేలియాకు చెందిన అష్టావధాని తటవర్తి కళ్యాణ్ చక్రవర్తి ఈ అష్టావధానం చేశారు.

పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం మహిమాన్విత క్షేత్రమని ముక్తేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా దేవాలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ.. పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో ప్రభుత్వం, దాతల సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు సూర్య కుమార్ మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నుంచి నేటి వరకు చెక్కు చెదరకుండా ఉన్న ఈ ఆలయం ప్రపంచ ఆర్కిటెక్చర్లోనే ఒక విశేషమని పేర్కొన్నారు. అవధాని తటవర్తి కళ్యాణ్ చక్రవర్తి ఛాయా సోమేశ్వరుడిని కీర్తిస్తూ అద్భుతమైన పద్యాలు చెప్పారు.

కార్యక్రమంలో సంచాలకులుగా ఆస్ట్రేలియాకు చెందిన సాహితీవేత్త డాక్టర్ వేణుగోపాల్ రాజుపాలెం వ్యవహరించారు. నిషిద్ధాక్షరి పృచ్ఛకులుగా సాగర్ల సత్తయ్య, సమస్యా పూరణం గౌతం లింగా (దక్షిణాఫ్రికా), దత్తపది - శ్రీనివాస భరద్వాజ్ కిషోర్ (అమెరికా), వర్ణన జ్యోతి విందమూరి (న్యూజిలాండ్), ఆశువు - ఉప్పల పద్మ (ఇండియా), అప్రస్తుత ప్రసంగం రాపోలు సీతారామరాజు (దక్షిణాఫ్రికా), న్యస్తాక్షరి - రాధిక మంగిపూడి (ఇండియా), చిత్రానికి పద్యం - గోపి వి ప్రసాద్ (జర్మనీ) నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభాకర్ రావు, ఎంవీ గోనారెడ్డి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన సర్పంచ్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి): నిరుపేదలకు అండగా నిలివాలని సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు అయిన వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో నగరి మహేశ్వరి కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయిన చెక్కును ను స్థానిక సర్పంచ్ ఉరిఢి రాంరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ ఉ రిడీ రాంరెడ్డి మాట్లాడుతూ నిరు పేదల పెన్నిధిగా సిఎం కెసిఆర్ నిలుస్తున్నారని అన్నారు. బాధితుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూనిరుపేదలకు ,సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసిన సీఎం కె?సిఆర్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబుకు బాధితుని కుటు ంబ సభ్యులు ,గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ ,ఎంపీపీ వైస్ చైర్మన్ ఉ రిడి ప్రవీణ్ , తెరాస గ్రామాధ్యక్షుడు నడిగడ్డి హరికృష్ణ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉరిడీరాజిరెడ్డి (మెడికల్) టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

2024లో ఏకపక్ష పాలనకు తెర : శివసేన ఎంపీ

ముంబై, అక్టోబర్ 30:: బీజేపీపై శివసేన ఎంపీ సంజయ్ రౌత్ శనివారం విమర్శలు గుప్పించారు. 2024లో కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, దీంతో ప్రస్తుత ఏకపక్ష ప్రభుత్వ పాలనకు తెరపడుతుందన్నారు. పుణేలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రధాన పార్టీ కాంగ్రెస్ అనీ, అది లేకుండా ఏ ప్రభుత్వం ఏర్పడదన్నారు. కాంగ్రెస్ కూడా ప్రతిపక్ష పార్టీ, ఇతర ప్రాంతీయ పార్టీలున్నాయి. బీజేపీ కూడా భారత రాజకీయాల్లోనే ఉంటుంది కానీ.. ప్రతిపక్ష పార్టీగా అని పేర్కొన్నారు.

రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ 'బీజేపీ చాలా దశాబ్దాలు అధికారంలో ఉంటుంది' అని చేసిన వ్యాఖ్యలను ఆయన వద్ద ప్రస్తావించిన సమయంలో ఈ విధంగా స్పందించారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీని బీజేపీ చెప్పుకుంటోందని, ఎన్నికల్లో ఓడిపోతే ప్రతిపక్షం అవుతుందన